నేడు గ్రేడ్-2 హెచ్ఎంలుగా పదోన్నతి సాధించిన స్కూల్ అసిస్టెంట్ సర్టిఫికెట్ల పరిశీలన

విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతికి అర్హత సాధించిన స్కూల్ అసిస్టెంట్ల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో జరగనున్నది. స్కూల్ అసిస్టెంట్లు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్, నిర్దేశించిన ధ్రువపత్రాలతో హాజరుకావాలని పాఠశాల విద్యా ఆర్జేడీ విజయ భాస్కర్, విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో సూచించారు.

ఆర్ఈసీఎస్ సొమ్ములు స్వాహా

రూ.10 కోట్ల విలువైన విద్యుత్ సామగ్రి కశింకోట నుంచి సింహాచలంలోని ఈపీడీసీఎల్ స్టోర్స్‌కు తరలింపు

ఈపీడీసీఎల్ వాహనాలు, సిబ్బంది వినియోగం

- వాటికి రవాణా చార్జీల కింద రూ.19.64 లక్షల క్లెయిమ్
- ఇస్తున్నది ఎవరు...? పుచ్చుకుంటున్నది ఎవరు..?
- అనకాపల్లి, విశాఖ అధికారుల సంయుక్త దోపిడీ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్) నిధులను అధికారులు అందినకాడికి దిగమింగుతున్నారు. ప్రతి నెలా కొన్ని కోట్ల రూపాయలు లాభాలు వస్తుండడంతో వాటిని ఏవేవో లెక్కలు వేసి సొంత జేబుల్లో వేసుకుంటున్నారు. ఇటీవలె ఎవరి అనుమతి లేకుండా సొసైటీ ఉద్యోగులకు పీఆర్‌సీ వర్తింపజేసిన సంగతి తెలిసిందే. దీనిపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించినా ఇటు కార్పొరేట్ కార్యాలయం గానీ, అక్కడ కశింకోట బాధ్యులు గానీ, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి అయిన జిల్లా కలెక్టర్ గానీ స్పందించలేదు. ఇప్పుడు అదే సొసైటీలో మరో బాగోతం వెలుగులోకి వచ్చింది.

ఆర్ఈసీఎస్ విద్యుత్ వ్యాపారం చేయడానికి ప్రభుత్వం లైసెన్స్ ఇవ్వనందున (పునరుద్ధరణ చేయనందున) దానిని ఏపీఈపీడీసీఎల్ స్వాధీనం చేసుకొని నిర్వహించాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి గతంలో ఆదేశించింది. ఆ ప్రకారం ఈపీడీసీఎల్ గత మూడేళ్లుగా ఆ సొసైటీకి 'ఆర్ఈసీఎస్ కశింకోట డివిజన్' అని పేరు పెట్టి, అక్కడ ఓ డీఈని నియమించి వ్యవహారాలు నడుపుతోంది. అయితే సొసైటీకి చెందిన అప్పులు, ఆస్తుల లెక్క తేలలేదు. సొసైటీ బాధ్యులు పూర్తి వివరాలు అందించకపోవడం వల్ల అవన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. ఆ డివిజన్‌కు యథా ప్రకారం విద్యుత్ సరఫరా చేసి, బిల్లులు వసూలుచేసి, సొసైటీ ఉద్యోగులకు ఈపీడీసీఎల్ జీతాలు చెల్లిస్తోంది. నిర్వహణ వ్యయం అంతా భరిస్తోంది. ఇవన్నీ వేరే బ్యాంకు ఖాతాల ద్వారా జరుగుతున్నాయి.

ఎవరి అనుమతితో తరలించారు?

ఇదిలావుండగా సొసైటీని స్వాధీనం చేసుకున్నప్పుడు అప్పటికే వారు విద్యుత్ పనుల నిర్వహణ కోసం సమకూర్చుకున్న పది కోట్ల రూపాయల విలువ చేసే మెటీరియల్ కశింకోటలోని ఆర్ఈసీఎస్ స్టోర్స్‌లో ఉంది. దానిని అక్కడి నుంచి సింహాచలంలో ఈపీడీసీఎల్ స్టోర్స్‌కు తరలించాలని విశాఖపట్నంలోని కార్పొరేట్ కార్యాలయంలోని సీజీఎం ఒకరు ఆదేశించారు. దాంతో కశింకోట ఆర్ఈసీఎస్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) దగ్గరుండి పంపించేశారు. ఈపీడీసీఎల్‌కు చెందిన వాహనాలతో సిబ్బంది సుమారు రెండు వారాలు తరలింపు ప్రక్రియ చేపట్టారు. ఇది గత ఏడాది ఆగస్టులో పూర్తయింది. ఇలాంటి వ్యవహారాలు నిర్వహించినప్పుడు ఏయే రకాల మెటీరియల్ ఎంత పంపించారు?, ఎక్కడికి పంపించారు?, వాటి విలువ ఎంత?...అనే వివరాలు రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. పైగా అప్పులు, ఆస్తుల లెక్క తేలనందున వాటిని ప్రత్యేక అనుమతులు ఉంటే తప్ప వినియోగించుకోవడానికి వీల్లేదు. ఈ నిబంధనను కూడా అధికారులు ఉల్లంఘించారు.

లోడింగ్, రవాణా చార్జీల క్లెయిమ్

మెటీరియల్‌ను సింహాచలం డిపోకు తరలించడానికి కార్పొరేట్ కార్యాలయం ఈపీడీసీఎల్ సిబ్బందిని, వాహనాలను పంపించింది. అంటే వారి పనులు వారే చేసుకున్నారు. దీనికి కశింకోట ఆర్ఈసీఎస్ డివిజన్ ఈఈ రవాణా చార్జీలు ఇవ్వాలంటూ రూ.19.64 లక్షలకు బిల్లు పెట్టారు. ఇండోర్, అవుట్ డోర్ మెటీరియల్‌ను వాహనాల్లో లోడింగ్ చేయడానికి, తరలింపునకు ఉపయోగించిన వాహనాలకు అద్దెలు చెల్లించడానికి ఈ వ్యయం అయిందని బిల్లు పెట్టుకున్నారు. ఈ బిల్లు మొత్తం ఎవరెవరు పంచుకున్నారంటే...కార్పొరేట్ కార్యాలయం, కశింకోట డివిజన్ అధికారుల పేర్లు వినిపిస్తున్నాయి.

ఆర్‌టీఐలో అడిగితే డొంక తిరుగుడు సమాధానం

కశింకోట ఆర్ఈసీఎస్ అవకతవకలపై అనేక ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ మెటీరియల్ తరలింపుపై వివరాలు కోరుతూ సమాచార హక్కు చట్టం కింద ఒకరు దరఖాస్తు చేశారు. మెటీరియల్ తరలింపునకు అనుమతి ఇచ్చింది ఎవరు?, ఎంత ఖరీదు, ఏయే మెటీరియల్ అనే వివరాలు కోరారు. కశింకోట అధికారులు దానికి ... మిగతా 6వ పేజీలో

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్ ఇద్దరు యువకుల దుర్మరణం

- అచ్యుతాపురం మండలం పెదపాడులో ఘటన
- గ్రామంలో విషాదఛాయలు



రాయి గణేశ్ (ఫైల్ ఫొటో)



జనపరెడ్డి సంజీవి (ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాడువద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. గ్రామంలో నుంచి మెయిన్ రోడ్డుపైకి వస్తున్న ట్రాక్టర్, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

పెదపాడుకు చెందిన రాయి గణేశ్ (23), జనపరెడ్డి సంజీవి (21) స్నేహితులు. గణేశ్ ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఒక టైర్ల తయారీ ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా, సంజీవి ఇదే ప్రాంతంలో వున్న రెబ్బెస్ట్ రిబ్బన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం వ్యక్తిగత పనిమీద తిమ్మరాజుపేట వెళ్లారు. అక్కడి నుంచి ఆరు గంటల గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నారు. ఆంజనేయస్వామి గుడి వద్దకు వచ్చేసరికి... గ్రామంలో నుంచి మెయిన్ రోడ్డులోకి వస్తున్న ట్రాక్టర్ ఢీకొన్నది. దీంతో రోడ్డుపై పడిపోవడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు. దీంతో ఇరువురి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు ... మిగతా 6వ పేజీలో

పట్నం కోర్టుకు మరింత వసతి

- రూ.3.09 కోట్లతో అదనపు భవన సముదాయం
- పరిపాలన అనుమతులు రాగానే టెండర్ ప్రక్రియ
- ప్రస్తుత భవనంపై మరో అంతస్థు నిర్మాణం



నర్సీపట్నంలో కోర్టు సముదాయం

నర్సీపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): **నర్సీపట్నంలో కోర్టు సముదాయం అదనపు భవనాల నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.3.09 కోట్లు మంజూరు చేసింది. త్వరలో పరిపాలన అనుమతులు వచ్చి, టెండర్ల ప్రక్రియ మొదలవుతుందని అధికారులు అంటున్నారు. నర్సీపట్నంలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు ప్రతిపాదనలు ఉండడంతో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని వీటిని నిర్మించునున్నట్టు తెలిసింది. ఉమ్మడి విశాఖ జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు ఇటీవల స్థానిక కోర్టు సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించి కొన్ని సూచనలు చేశారు.**

నర్సీపట్నం కోర్టు సముదాయం గతంలో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉండేది. పురాతన భవనాల్లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడేవారు. దీంతో గత టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆనుకొని కొత్త భవన సముదాయం నిర్మించారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణ నుంచి కోర్టు సముదాయాన్ని అక్కడకు తరలించారు. ఇక్కడ సీనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపల్‌జూనియర్ సివిల్ జడ్జి, అదనపు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు, స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులు నడుస్తున్నాయి. అయితే గతంలో నిర్మించిన భవన సముదాయం చాలకపోవడంతో అదనపు భవనాల నిర్మాణాకి మూడేళ్ల క్రితం రూ.2.3 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. పరిపాలన అనుమతులు వచ్చి, టెండర్లు పిలిచారు. కానీ బిడ్లు దాఖలు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. న్యాయస్థానాలకు అదనపు వసతి సమకూరలేదు. గత ఏడాది ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది, శాసనసభ స్పీకర్ అయిన అయ్యన్నపాత్రుడు.. కోర్టు సముదాయం అదనపు భవనాల నిర్మాణానికి గట్టిగా కృషి చేశారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో అధికారులు ఇటీవల అంచనాలు రూపొందించారు. ప్రస్తుత రేట్ల ప్రకారం నిర్మాణ వ్యయాన్ని రూ.3.09 కోట్లకు పెంచారు. ఆర్థిక శాఖ నుంచి పరిపాలన పరమైన ఆమోదం వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామని ఆర్అండ్‌బీ అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఉన్న కోర్టు సముదాయం కింది అంతస్థులో పార్కింగ్, మొదటి అంతస్థులో కోర్టులు నిర్వహిస్తున్నారు. రూ.3.09 కోట్లతో రెండో అంతస్థు నిర్మిస్తారు. ఇందులో కొంతభాగంలో బ్యాంకు, పోస్టాఫీసు, క్యాంటీన్ వంటివి ఏర్పాటు చేస్తారు.

తాండవకు నిధుల వరద

57 మరమ్మతు పనులకు రూ.4.2 కోట్లు మంజూరు

- అక్విడక్టులు, అండర్ టన్నెళ్లు, సూపర్ పాసేజ్‌లకు మరమ్మతులు
- ప్రాజెక్టు డీఈఈ అనురాధ వెల్లడి
- నీటి సంఘాల ఆధ్వర్యంలో పనులు
- ఖరీఫ్‌కు నీటి విడుదల చేసేనాటికి పూర్తి





మరమ్మతు పనులు చేపట్టనున్న ఎడమ కాలువ 1.5 కిలోమీటరు వద్ద, కుడి కాలువ 6వ కిలోమీటరు వద్ద అక్విడక్టులు

నాతవరం, మే 26 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ కాలువలకు సంబంధించి అక్విడక్టులు, అండర్ టన్నెళ్లు, సూపర్‌పాసేజ్‌లు, ఇతర మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ.4.2 కోట్లు మంజూరు చేసిందని తాండవ ప్రాజెక్టు డీఈఈ అనురాధ తెలిపారు. సోమవారం ఇక్కడ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన నీటి సంఘాల అధ్యక్షుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఎనిమిది అక్విడక్టులు, ఏడు అండర్ టన్నెళ్లు, పదికిపైగా సూపర్ పాసేజ్‌లతో కలిపి మొత్తం 57 పనులకు నిధులు మంజూరయ్యాయని, నీటి సంఘాల ఆధ్వర్యంలో వెంటనే పనులు ప్రారంభించి ఖరీఫ్‌కు నీటిని విడుదల చేసే సమయానికల్లా పూర్తిచేయాలని చెప్పారు. కాగా మైనర్ కాలువకు పలుచోట్ల తలుపులు పాడై నీరు వృథాగా పోతున్నదని, అందువల్ల తలుపులు ఏర్పాటు చేయించాలని పలు నీటి సంఘాల అధ్యక్షులు కోరారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.5 కోట్లతో కాలువల్లో పూడిక తీయిస్తున్నామని, మెయిన్ గేట్ల మరమ్మతు పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇంకా పలు కట్టడాల మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి రామానాయుడుని, స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కోరడంతో తాజాగా రూ.4.2 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ జోగిబాబు, నాయకులు నందిపల్లి వెంకటరమణ, పారుపల్లి కొండబాబు ఎస్.విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు తదితరులు పాల్గొన్నారు.



భారీ వర్షం పడడంతో బీఎన్ రోడ్డులో రోలుగుంట వద్ద నీరు నిలిచి చెరువును తలపిస్తున్న గోతులు

ముందస్తు రుతుపవన వాతావరణం

- పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై వుంది. నైరుతి రుతుపవనాలు ఇంకా జిల్లాలోకి ప్రవేశించనప్పటికీ.. వాతావరణం మాత్రం రుతుపవనాలు వచ్చేసినట్టుగా వుంది. మాడుగుల, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల్లో పలు ప్రాంతాల్లో గాలులతో వర్షం కురిసింది. రోలుగుంట, రావికమతం, నాతవరం మండలాల్లో భారీ వర్షం పడింది. మిగిలినచోట్ల మోస్తరు జల్లులు పడ్డాయి. రహదారులపై గోతులు పూడ్చనిచోట నీరు చేరి, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కాగా తీవ్ర వడగాడ్పులు వీచాల్సిన సమయంలో ఇందుకు భిన్నంగా వాతావరణం చల్లగా ఉండడంతో ప్రజలు వేసవి తాపం నుంచి ఉపశమనం చెందుతున్నారు. ఇదిలావుండగా రైతులు జనుము, పిల్లిపెసర, జీలుగ వంటి పచ్చిరొట్ట విత్తనాలు చల్లడానికి పొలాలను సిద్ధం చేస్తున్నారు.

రేషన్ డిపోల్లోనే సరకులు

- వచ్చే నెల నుంచి అమలు
- ఒకటి నుంచి 15వ తేదీ వరకు పంపిణీ
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు డిపోలు ఓపెన్
- వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే సరకులు
- జిల్లా పౌరసరఫరాల అధికారి మూర్తి



మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారి మూర్తి

అనకాపల్లి కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరకులను చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయనున్నట్టు జిల్లా పౌరసరఫరాల అధికా కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎండీయూ వాహనాల ... మిగతా 6వ పేజీలో

విచ్చలవిడిగా ఇసుక, గ్రావెల్ తవ్వకాలు

- అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు
- వెంటనే చర్యలు తీసుకోవాలి
- జనసేన పార్టీ చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు
- విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీకి ఆధారాలతో సహా ఫిర్యాదు

చోడవరం, మే 26 (ఆంధ్రజ్యోతి): చోడవరం నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట వేయాలని జనసేన పార్టీ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉత్తరాంధ్ర ఎస్పీ కె.ప్రభాకరరావుకు ఫిర్యాదుతో కూడిన వినతిపత్రం అందించారు. చోడవరం మండలం గవరవరం, లక్కవరం, శేమునాపల్లి. వెంకన్నపాలెం, నరసాపురం, రాయపురాజుపేట, గజపతినగరం, జుత్తాడ, భోగాపురం, ముద్దుర్తి గ్రామాల్లో విచ్చలవిడిగా ఇసుక, గ్రావెల్ తవ్వకాలు సాగుతున్నాయని ఎస్పీకి వివరించారు. యంత్రాలతో ఇసుకను తవ్వి విశాఖ, అనకాపల్లి ప్రాంతాలకు తరలించి వ్యాపారం చేస్తున్నారని, కానీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. శారదా నదిలో ఇసుక తవ్వకాల పేరుతో సాగుతున్న విధ్వంసాన్ని వీడియోలు, ఫొటోలతో సహా ఎస్పీకి అందించారు.



విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉత్తరాంధ్ర ఎస్పీ కె.ప్రభాకరరావుకు ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న జనసేన పార్టీ 'చోడవరం' ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు

గొంప మెట్టపై మైనింగ్ తనిఖీలు

- నల్ల రాయి తవ్వకాలకు ఉపయోగిస్తున్న యంత్రాలు సీజ్

రావికమతం, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ పంచాయతీ రెవెన్యూ పరిధిలో గొంప మెట్టపై నల్ల రాయి తవ్వకాలు జరుగుతున్నట్టు సమాచారం రావడంతో సోమవారం మైనింగ్ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. అయితే అధికారులు వస్తున్నట్టు ముందుగా సమాచారం రావడంతో తవ్వకందారులు పరారయ్యారు. భూగర్భ గనుల శాఖ నర్సీపట్నం డివిజన్ ఏడీ జి.శివాజీ సిబ్బందితో అక్కడికి వెళ్లి తవ్వకాలకు ఉపయోగిస్తున్న యంత్రాలను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. రావికమతం డిప్యూటీ తహసీల్దార్ జి.అప్పలనాయుడు, వీఆర్వో పి.నారాయణరావులకు వీటి సంరక్షణ బాధ్యత అప్పగించారు. అనంతరం మైనింగ్ ఏడీ శివాజీ విలేకరులతో మాట్లాడుతూ గుడివాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 399/పిలో నాలుగు ఎకరాల 95 సెంట్లు విస్తీర్ణంలో నల్ల రాయి తవ్వకాలకు అనుమతుల కోసం నెట్‌కమ్ ఐటీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ-ఆక్షన్‌లో రూ.16.2 లక్షలు చెల్లించి అనుమతులు కోరిందన్నారు. అయితే దీనికి సంబంధించి అవసరమైన ధ్రువపత్రాలు, అగ్రిమెంట్లు ఇంత వరకు తమకు సమర్పించలేదన్నారు. నిబంధనల ప్రకారం ధ్రువపత్రాలు సమర్పించిన తర్వాత మాత్రమే రాయి తవ్వకాలకు పూర్తి స్థాయి అనుమతులు ఇస్తామని ఆయన తెలిపారు.



తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని, ఉపయోగించిన యంత్రాలను పరిశీలిస్తున్న నర్సీపట్నం డివిజన్ మైనింగ్ ఏడీ శివాజీ, తదితరులు

ఇళ్ల మధ్య మురుగు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- దోమలకు ఆవాసాలుగా మారుతున్న కాలువలు
- పూడిక తొలగించక అధ్వానంగా నేరెళ్ల కాలువ


సన్యాసిరావుకాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన మురికినీరు

పాయకరావుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ లేని కాలనీల్లో ఇళ్ల మధ్య మురికినీటి నిల్వలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు పట్టణం మధ్యలో ప్రవహిస్తున్న నేరెళ్ల కాలువలో పూడిక, చెత్తను మూడేళ్లుగా తొలగించకపోవడంతో దుర్వాసన వెళుతోంది. మురుగునీరు పారకపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

పాయకరావుపేట పంచాయతీలో ఇప్పటి వరకు 200 ఎకరాల్లో వేసిన లేఅవుట్లలో చాలావరకు డ్రైనేజీలు, రోడ్లు తదితర వసతులు లేవు. పట్టణంలో ప్రశాంతినగర్, సాయినగర్, రాజుగారిబీడు, కురుమళ


జీవీఆర్.నగర్‌ని ఆనుకుని ఉన్న నేరెళ్ల కాలువలో పేరుకుపోయిన పూడిక, చెత్త

వారి లేఅవుట్, పెదిరెడ్డి సన్యాసిరావునగర్, దేవినగర్, చెక్కానగర్, వీవర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో నిలిచిన మురుగునీటితో నివాసముంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పట్టణంలో రాజుగారిబీడులో మెయిన్ డ్రైనేజీలు ఏర్పాటుచేసినా మిగిలిన వీధుల్లో లేకపోవడంతో ఇళ్ల ఎదుట మురికినీటి గుంతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీల్లోని ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న మురికి నీటి వలన అంటు రోగాలు ప్రబలితే ఎవరు బాధ్యులని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పట్టణం మధ్యలో ప్రవహిస్తున్న నేరెళ్ల కాలువలోకి వివిధ ప్రాంతాల నుంచి మురికినీరు వచ్చి చేరుతున్నది. ఈ కాలువలో పేరుకుపోయిన పూడిక, చెత్తను మూడేళ్లుగా తొలగించని కారణంగా ఎక్కడ మురుగునీరు అక్కడే నిలిచిపోతున్నది. ఇక పట్టణంలోని మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలను శుభ్రం చేసేందుకు వీలులేకుండా షాపుల యజమానులు కప్పేశారు. దీంతో కాలువల్లోని చెత్త, పూడికలను తీసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో దోమలు వృద్ధి చెంది పట్టణ ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. రానున్న రోజుల్లో వర్షాలు పడితే పరిస్థితి మరింత భయంకరంగా మారే ప్రమాదం ఉందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించడంతోపాటు ఖాళీ స్థలాల్లోని మురికినీరు లేకుండా చేయాలని కోరుతున్నారు.

బ్రోకర్లదే హవా

- తక్కువ ధరకు తీసుకొని అధిక మొత్తాలకు అద్దెకు..
- లక్షల్లో ఆర్జించిన మధ్యవర్తులు
- వీధికుక్క రూ. వెయ్యికు విక్రయం
- సైబర్ నేరగాళ్ల కేసు సీఐడీకి అప్పగించడంతో బెంబేలు



అచ్యుతాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురంలో సైబర్ నేరగాళ్లకు సహాయం చేసి లక్షలు ఆర్జించిన మధ్యవర్తులకు ఇప్పుడు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. గెస్టుహౌస్‌లు, అపార్టుమెంట్‌లు అద్దెలకు ఇప్పించిన విషయంలో బ్రోకర్లు ప్రతి నెలా లక్షల్లో సంపాదించారు. మధ్యవర్తులకు అధిక మొత్తంలో డబ్బులు ఎరవేసి సైబర్ నేరగాళ్లు ఇక్కడ తిష్ట వేశారు. చివరకు పోలీసులకు చిక్కడంతో అంతా పరారయ్యారు. కానీ వీరికి సహకరించిన మధ్యవర్తులు ప్రస్తుతం కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. నేరగాళ్ల మధ్యవర్తుల్ని డబ్బులతో లోబరచుకొని తమ పని చేసుకుపోయారని తెలిసింది. సైబర్ నేరగాళ్లు ముందుగా ఇక్కడ తిష్ట వేయడానికి అనువైన మారుమూల ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు. అద్దెలు ఎంతయినా పర్వాలేదని, అధిక సంఖ్యలో అపార్టుమెంట్లు కావాలని భారీగా డబ్బును ఎరవేశారు. దీనికి లొంగిపోయిన మధ్యవర్తులు వీరికి అన్ని ఏర్పాట్లు చేశారు. తొలుత గెస్టుహౌస్‌ను యజమాని నుంచి నెలకు రూ.25 వేలు అద్దెకు మధ్యవర్తులు మాట్లాడుకొన్నారు. దానిని సైబర్ నేరగాళ్లకు రూ.లక్షకు అద్దెకు ఇచ్చారు. అనంతరం అచ్యుతాపురం-పూడిమడక ప్రధాన రహదారిలో కుమారపురం శివారు మారుమూలనున్న ఒక అపార్టుమెంటుని మధ్యవర్తులు నెలకు రూ.70 వేలకు అద్దెకు తీసుకొని నేరస్తులకు రూ.రెండు లక్షలకు అద్దెకిచ్చారు. ఇదే విధంగా భోగాపురం వద్ద పవన్ అపార్టుమెంటు, జంగులూరు జంక్షన్ వద్ద గల భువనేశ్వరి అపార్టుమెంటు, ఎమ్మెల్యే ఇంటికి వెళ్లే మార్గంలో గల ఉషోదయ అవెన్యూని ఇదే పద్ధతిలో మధ్యవర్తులు అద్దెలకిచ్చారు. అంతేకాక వీరికి నిత్యావసర వస్తువులతో పాటు రవాణాకు కావలసిన వాహనాలను కూడా బ్రోకర్లే సమకూర్చేవారు.

వీధి కుక్కకు రూ.వెయ్యి

ఫిలిప్పీన్స్‌తోపాటు నాగాలాండ్‌కి చెందిన వారు కుక్క మాంసాన్ని చాలా ఇష్టపడతారట. వీరికి వారానికి ఒక కుక్కని ఇస్తే వెయ్యి రూపాయలు ఇచ్చేవారట. దీంతో మధ్యవర్తులు కుక్కల వ్యాపారాన్ని కూడా భారీ స్థాయిలో చేశారని తెలిసింది. వారానికి వీరికి సుమారు పది కుక్కలకు పైగా సరఫరా చేసేవారని తెలిసింది. అలాగే వీరిలో చాలామందికి మాదక ద్రవ్యాల (డ్రగ్స్) అలవాటు ఉంది. వీరికి కావలసిన డ్రగ్స్ కూడా స్థానిక మెడికల్ షాపుల నుంచి తెప్పించి ఇచ్చేవారని తెలిసింది. ఏడాది పాటు ఈ వ్యాపారం ఎటువంటి అవాంతరం లేకుండా సాగింది. ఈ కేసు సీఐడీకి అప్పగించడంతో తమపేర్లు బయటకు వస్తాయని మధ్యవర్తులు బెంబేలెత్తిపోతున్నారు.

అహల్య బాయి హోల్కర్‌పై వ్యాసరచన పోటీలు


మహిళలకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, మే 26 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం మహారాణి అహల్యా బాయి హోల్కర్ 300వ జయంతిని పురస్కరించుకుని ఆమె జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చైర్‌పర్సన్ రమాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వ్యాసరచన పోటీల్లో అహల్యా భాయ్ జీవిత చరిత్ర, వారి ఇతివృత్తం గురించి పోటీలు నిర్వహించారు. స్థానిక మహిళలతోపాటు మెప్మాలో 63 మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు జయంతి రోజున బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని మునిసిపల్ కార్యాలయ అధికారి తెలిపారు.

శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు


శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి):స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులకు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురించి, జూనియర్స్‌కి వేసవి విజ్ఞాన శిబిరంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు యోగాలో ఆసనాలు వేయడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు, శిక్షకులు ఎస్.సీతారామమూర్తి, తాల్‌రావు, ఎన్‌టీ.సీతారామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి పెంచుకోవాలి


సేంద్రియ వ్యవసాయంతో పండించిన కూరగాయలను పరిశీలిస్తున్న ఏపీవో సత్యవతి

కోటవురట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయసంఘాల సభ్యులు సేంద్రియ ఎరువులతో సాగుచేస్తున్న కూరగాయలు విక్రయాలు చేస్తున్నారు. సోమవారం కోటవురట్ల స్త్రీశక్తి కార్యాలయం ఎదురుగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల విక్రయ స్టాల్‌ను వెలుగు ఏపీఎం సత్యవతి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన కూరగాయలు ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహానాడుకు తరలిన తమ్ముళ్లు



కోటవురట్లలో జెండా ఊపుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు లింగంనాయుడు


మహానాడుకు తరలివెళుతున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, తదితరులు

ఎలమంచిలి, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు ఎలమంచిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావుతోపాటు ప్రధాన నేతలు, కార్యకర్తలు బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో వెళ్లారు. మహానాడుకు పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గెంజి శ్రీను, నేతలు గొన్నాబత్తుల నాగేశ్వరరావు, ఇతర నేతలు తరలివెళ్లారు.

ఎస్.రాయవరంలో..

కడపలో జరగనున్న మహానాడు వేడుకకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు సోమవారం బయలుదేరి వెళ్లారు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, ఎన్ వెంకటరాజు, తదితర నేతలు ఆయా గ్రామాల నుంచి పలు వాహనాల్లో తరలివెళ్లారు. దీంతో గ్రామాల్లో ముందుగానే పండగ వాతావరణం నెలకొంది.

కోటవురట్లలో..

కడపలో జరగనున్న మహానాడుకు మండలం నుంచి సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు ఆధ్వర్యంలో బీ కేపల్లి జల్లూరు, కోటవురట్ల, రామచంద్రపాలెం, సుంకపూర్ తదితర గ్రామాల్లో కార్యకర్తలు బస్సులపై కడప బయలుదేరారు. మరికొందరు నాయకులు వ్యక్తిగత కారుల్లో మహానాడుకు తరలివెళ్లారు.

27 ఏళ్ల తర్వాత ఆత్మీయ కలయిక

- సందడి చేసిన 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు


ఎం.జగన్నాథపురం హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అచ్యుతాపురం రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పూర్వ విద్యార్థులు 27 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. మండలంలోని ఎం.జగన్నాథపురంలో 1998-99 సంవత్సరంలో పదో తరగతి చదివిన వారు సోమవారం హైస్కూల్‌లో కలుసుకొని సందడి చేశారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, లక్ష్మి, కనకేశ్వరరావు, సత్తిబాబు, గ్రామ మాజీ సర్పంచ్ కరెడ్ల సూర్యప్రకాశ్, అప్పటి స్కూల్ కమిటీ చైర్మన్ చిట్టి శివశంకరరావులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నానాజీ, ప్రకాశ్, శ్రీను, రాజు, సంతోష్, బుజ్జి, జ్యోతి, ధనలక్ష్మి, హుస్సేన్ పాల్గొన్నారు.

తెరువుపల్లిలో అంబేడ్కర్ కళావేదిక ప్రారంభం

ఎలమంచిలి, మే 26 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ తెరువుపల్లి దళిత కాలనీలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కళావేదికను ప్రారంభించారు. ఈ వేదికను గ్రామస్థులు, స్థానిక ఉద్యోగులు నిర్మించుకున్నారు. వేదిక నిర్మాణ సమన్వయకర్త మండే సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళావేదిక నిర్మాణ కమిటీ చైర్మన్ బైపా నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ తెరపల్లి శ్రీనివాసరావు, సభ్యులు జి. రజినీకాంత్, టి.సూర్యారావు, స్థానిక నేతలు టి. శ్రీనివాసరావు, టి. కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులపై చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎలమంచిలి, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనుల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన మునిసిపల్ అధికారులు సోమవారం చర్యలకు ఉపక్రమించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'అసంపూర్తి పనులతో అవస్థల శీర్షికన వచ్చిన కథనానికి మునిసిపల్ ప్రజారోగ్యశాఖ అధికారులు స్పందించారు. పెదపల్లి రోడ్డుపై నిలిచిన వర్షం నీటిని మునిసిపల్ సిబ్బంది తొలగించారు. అదేవిధంగా పరమేశ్వరి థియేటర్ సమీపంలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీలో చెత్త చెదారాన్ని తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వర్షం నీటిని తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

అచ్యుతాపురం రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం స్థానిక తన నివాసంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మురుగు నీటి కాలువలలో చెత్తను తొలగించి, రహదారులను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. ప్రజలకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రమాకుమారికి అభినందన


రమాకుమారిని సత్కరిస్తున్న మహిళలు, డ్వాక్రా సభ్యులు

పాయకరావుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగు మహిళ పాయకరావుపేట నియోజకవర్గ అధ్యక్షురాలిగా రెండోసారి నియమితులైన మల్లవరపు రమాకుమారిని సోమవారం పలువురు మహిళలు ఘనంగా సత్కరించారు. పట్టణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎం.రమాకుమారిని జనసేన పార్టీ వీరమహిళలు నారపురెడ్డి పద్మ, వార్డు సభ్యురాలు దేవాది మంగాదేవి, లక్ష్మి తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు డ్వాక్రా సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సమస్యలను సంఘటితంగా ఎదుర్కోవాలి

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు దేవి
- ముగిసిన మహిళా శిక్షణ తరగతులు



మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు దేవి

మునగపాక, మే 26 (ఆంధ్రజ్యోతి): సమస్యలను సంఘటితంగా ఎదుర్కోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.దేవి పిలుపునిచ్చారు. మండలంలో తిమ్మరాజుపేట గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర మహిళా శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలు ఎదురైతే నిరాశకు గురికాకుండా ఆత్మస్థైర్యంతో వాటిని ఎదుర్కొనే విధంగా మహిళల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. శిక్షణ తరగతుల్లో అంశాలను గ్రామాల్లో ప్రచారం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో వై.సత్యవతి, రామాదేవి, మాణిక్యం, మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

'దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి'

నక్కపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డొంకాడ దళితులపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని పలువురు దళిత నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం ఎదుట వారు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులపై దాడి జరిగి తొమ్మిది రోజులు అవుతున్నా నేటికీ నిందితులను పోలీసులు అరెస్టు చేయకపోవడం అన్యాయమన్నారు. దాడికి గురైన బాధితులు ఇచ్చిన ఫిర్యాదుకు తగ్గట్టుగా ఎఫ్‌ఐఆర్‌లో సెక్షన్లు నమోదు చేయకుండా దోషులను కాపాడే విధంగా బెయిలబుల్ సెక్షన్లు వేయడం జరిగిందన్నారు. ఇలా అయితే బాధితులకు న్యాయం ఎలా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవిసిద్ధార్థ, రాజుబాబు, బి.వెంకటరమణ, ఎం.అప్పలరాజు, చిరంజీవి, లోవరాజు, రాము, అప్పారావు, కన్నారావు, శివ, ఆనందరావు, స్వర్ణరాజు, మురళి, రాజు తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దళితులు

యోగాంధ్ర కోసం సమన్వయంతో పనిచేయాలి

నక్కపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర-2025 కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ డి.సీతారామరాజు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర -2025పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, విద్యా, రెవెన్యూ, మండల పరిషత్, ఉపాధి పథకం, వైద్యఆరోగ్యశాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో యోగాంధ్రను జయప్రదం చేయాలన్నారు. అదేవిధంగా తహసీల్దారు నరసింహమూర్తి మాట్లాడుతూ యోగాంధ్ర యాప్‌లో నమోదు చేసుకున్న వారంతా ఒక్కొక్కరూ 50 మందితో రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశించారు. సమావేశంలో ఆయుష్ డాక్టర్ కె.రఘు, ఎంఈఓ కె.నరేష్, తెలుగు పండిట్ ఎన్‌వీఎస్.ఆచార్యులు, యోగా గురువు డి.రాంబాబు, ఉపాధ్యాయులు అప్పలరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో యోగాంధ్ర పోటీలు ప్రారంభం

నక్కపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో యోగాంధ్ర పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో యోగాపై పోటీలు నిర్వహించడంతోపాటు ర్యాలీలు నిర్వహించారు. మండలంలోని రాజయ్యపేటలో ఆయుష్ యోగా శిక్షకులు దవరసింగి రాంబాబు, డీఎన్‌వీ.సాయి, తెలుగు పండిట్ ఎన్‌వీఎస్.ఆచార్యులు పర్యవేక్షణలో యోగా పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని వేంపాడులో ఆయుష్ సిబ్బంది నరసమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. రాజయ్యపేటలో జరిగిన కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం మూర్తిరాజు, పీఈటీ రాంకుమార్, ఎన్‌వీఎస్.ఆచార్యులు పాల్గొనగా, వేంపాడులో సచివాలయం కార్యదర్శి సత్యం, సిబ్బంది ఆకేటి పార్వతి, జి.శివబాబు, గాయత్రి, హైమ, మహేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



రాజయ్యపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక పీహెచ్‌సీ తనిఖీ


వ్యాక్సిన్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఇమ్యూనైజేషన్ అధికారి చంద్రశేఖర్

మునగపాక, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చంద్రశేఖర్ సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వ్యాక్సిన్‌లు నిలువ ఉంచిన ఫ్రిజ్‌లను పరిశీలించారు. ఫ్రిజ్‌లకు నిరంతరం విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. అనంతరం వ్యాక్సిన్‌లపై ఉన్న గడువు తేదీలను పరిశీలించారు. వైద్యాధికారిణి ఎం.నాగలక్ష్మి వైద్యసేవలు, ఓపీ తదితర వివరాలను తెలియజేశారు. ఆయన వెంట జిల్లా గణాంక అధికారి ఎ.రామచంద్రరావు ఉన్నారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు వేగవంతం



▸▸ అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్స వాన్ని వచ్చే నెల 21న నిర్వహించనున్న సందర్భంగా యోగా ప్రాధాన్యతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 27 నుంచి గ్రామ, మండలాల్లో యోగా అభ్యాస కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. మంగళవారం పెందుర్తి నియోజకవర్గంలోని పరవాడ మండలంముత్యాలమ్మపాలెం బీచ్ వద్ద ఉదయం ఏడు గంటలకు యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి వెయ్యి మంది యోగా అభ్యాసకులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆమె సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటకశాఖ అధికారిణి కె.మనోరమ పాల్గొన్నారు.



యోగాంధ్రపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సత్యనారాయణ

యోగాపై అవగాహన అవసరం

సబ్బవరం : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యోగా గురువు పొని పిరెడ్డి సత్యనా రాయణ అన్నారు. పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెంలో మంగళవారం జిల్లాస్థాయిలో నిర్వహించే యోగాంధ్ర ఏర్పాట్లలో భాగంగా మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులకు సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగాపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలన్నారు. ఎంపీడీవో పి.పద్మజ మాట్లాడుతూ జూన్ 21న ప్రధాని రాకను పురస్కరించుకొని నెలరోజులు యోగాపై శిక్షణ కార్య క్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సబ్బవరం మండలం నుంచి మాస్టర్ ట్రైనీలుగా యోగా గురువులు పొని పిరెడ్డి సత్యనా రాయణ, దివ్య, కె.కృష్ణ, పీడీ రెహ్మాన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ నుంచి కోటేశ్వరమ్మలను ఎంపిక చేశామన్నారు.

అన్నమయ్య పార్కు పునరుద్ధరణకు వినతి



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్/తుమ్మపాల, మే 26 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిలోని శారదా నది ఒడ్డున గల అన్నమయ్య పార్కును తక్షణమే తీర్చిదిద్దాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలియజేసి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007వ సంవత్సరంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శారదానది ఒడ్డున సుందరమైన అన్నమయ్య పార్కును నిర్మించారన్నారు. పార్కులో 21 అడుగుల అన్నమయ్య విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసి ప్రారంభించారన్నారు. కాలక్రమేణా ఈ పార్కును పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరిందన్నారు. ప్రస్తుతం పార్కు రూపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా అన్నమయ్య పార్కును పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, రమణమూర్తి, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల గుర్తింపునకు ఇంటింట సర్వే



ఇంటింటా సర్వేలో భవితా కేంద్రం ఉపాధ్యాయులు

కశింకోట, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో విభిన్న ప్రతిభావంతుల గుర్తింపునకు సోమవారం ఇంటింట సర్వే చేపట్టారు. జిల్లా కో-ఆర్డినేటర్ శకుంతల బృందం ఇంటింటికీ వెళ్లారు. సత్తమ్మతల్లి కాలనీలో విభిన్న ప్రతిభావంతులను గుర్తించారు. వీరిని భవిత కేంద్రంలో చేర్పించి అవసరమైన వసతి సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు బి.వి.రమణమ్మ, ఎస్.దీప పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన సేవా సంఘం కార్యవర్గ సభ్యులు

పరవాడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : భవనా రుషి భక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం మండల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా వానపల్లి అప్పలరాజు, ఉపాధ్యక్షుడిగా గుదే సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా దొడ్డి కృష్ణ, కోశాధికారిగా తేలు పైడిరాజు, సహాయ కార్యదర్శిగా సూరిశెట్టి మణికుమార్, కమిటీ ఆర్గనైజర్‌గా వానపల్లి చలపతిరావు ఎన్నికయ్యారు. ప్రధాన సలహాదారులుగా దొడ్డి సత్యనారాయణ, వానపల్లి సూరిబాబు, సిద్ధనాటి దేవుడుతో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రెండు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో కార్పొరేటర్ వరలక్ష్మి, తదితరులు

లంకెలపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలను ప్రణాళిక ద్వారా పరిష్కరిస్తున్నట్టు జీవీఎంసీ 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి తెలిపారు. వార్డు పరిధిలోని మంత్రిపాలెం, శ్రీరామనగర్ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు తమ దృష్టికి తీసుకు రావాల్సిందిగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల ప్రసాద్, దుల్ల రామునాయుడు, జెర్రిపోతుల అప్పారావు, ఇల్లపు ప్రసాద్, మూర్తి, సత్తిరాజు, రాజు, అప్పారావు, నూకరాజు, లక్ష్మి పాల్గొన్నారు.

సబ్సిడీపై పశుదాణా పంపిణీ

కశింకోట, మే 26 (ఆంధ్రజ్యోతి) : తేగాడ రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం పాడి రైతులకు యాభై శాతం రాయితీపై పశుదాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, కూటమి నాయకులు చిదిరెడ్డి సూర్యనారాయణ, కర్రి సత్యనారాయణ మాట్లాడుతూ పాడి పశువుల సంరక్షణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ అల్ఫోన్సా జార్జి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాడి రైతులకు సబ్సిడీ దాణా అందజేస్తున్న కూటమి నాయకులు

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

▸▸ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, మే 26 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తెలిపారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటైన కుట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి మహిళ ఆర్థిక శక్తిగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్లను అందజేస్తుందన్నారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం మంచి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ఎంపీడీవో పి.పద్మజ, వైస్ ఎంపీపీ రూప్సిలక్ష్మీరాణి, ఎంపీటీసీలు చొక్కాకుల గోవింద, కర్రి అప్పారావు, శీరం అప్పలరాజు, శింగంపల్లి శ్రీను, నాయకులు ఇందలి రమణ, కర్రి కనకరాజు, శరగడం రాము, గొర్లి కుమార్, శేఖర్, కొండాజీ, ఉగ్గిన రాము, బి.పద్మ, బలిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో అక్రమాలపై దర్యాప్తు

ఇదిలావుంటే, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్ల కాలనీకి సంబంధించి ఇళ్ల స్థలాల పేరుతో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరిపిస్తామని ఎమ్మెల్యే రమేశ్‌బాబు విలేకరుల సమావేశంలో తెలిపారు. జగనన్న కాలనీల్లో అక్రమాలు జరిగాయని, పేదల పేరుతో ఇళ్ల స్థలాలు అమ్ముకొని కొంత మంది సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అర్బన్‌లో రెండు సెంట్లు, రూరల్‌లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు అర్హులకు ఇవ్వనుందన్నారు. ఈ మేరకు అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయాధికారులు ఏర్పాటు చేసిన కూరగాయలు, ఆకు కూరల స్టాల్‌ను పరిశీలించి కొనుగోలు చేశారు. ప్రజలంతా ఇటువంటి ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతులను ప్రోత్సహించాలని కోరారు.

కన్యకాపరమేశ్వరీ ఆలయంలో

భక్తిశ్రద్ధలతో వట సావిత్రి వ్రతం



అమ్మవారి వ్రతంలో పాల్గొన్న మహిళలు

అనకాపల్లి టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వైశాఖమాస బహుళ అమావాస్య సందర్భంగా సోమవారం మహిళలతో సామూహిక వట సావిత్రి వ్రతాన్ని జరిపించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై ఈ వ్రతాన్ని చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీదరాల సోమరాజు, ఉత్స కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

12 మద్యం బాటిళ్లతో వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి కొత్తూరు జంక్షన్ వద్ద సోమవారం ఓ వ్యక్తి మద్యం సీసాలతో పోలీసులకు పట్టుబడ్డాడు. కశింకోట మండలం బయ్యవరానికి చెందిన దేవర తలుపులు 12 మద్యం క్వార్టర్ బాటిళ్లు కొనుగోలు చేసి వెళుతుండగా, కొత్తూరు జంక్షన్ వద్ద అనుమానం వచ్చి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

లేటరైట్ తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నర్సీపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలంలోని సుందరకోట పంచాయతీ బమిడికలొద్దిలో అక్రమంగా జరుగుతున్న లేటరైట్ తవ్వకాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ సోమవారం ఒక వీడియో సందేశంలో తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు లేటరైట్ తవ్వకాల ద్వారా రోజుకు రూ.3 కోట్లు అక్రమంగా సంపాదిస్తున్నారని ఆయన ఆరోపించారు. గత నెల 28న ఒకపర్యాయం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మరో సారి ఫిర్యాదు చేశామని తెలిపారు. కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కోర్టును ఆశ్రయిస్తామని ఆయన హెచ్చరించారు.

ఎండీయూ ఆపరేటర్ల నిరసన ప్రదర్శన

▸▸ వాహనాల ద్వారానే రేషన్ సరకుల పంపిణీకి డిమాండ్

అనకాపల్లి టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఎండీయూ ఆపరేటర్లు సోమవారం ఇక్కడ ఆందోళ చేపట్టారు. నెహ్రూచౌక్ నుంచి ప్రారంభమైన నిరసన ప్రదర్శన కలెక్టరేట్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు కోన లక్ష్మణ మాట్లాడుతూ ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ విధానం రద్దు చేయడం ద్వారా 20వేల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జెట్టి శ్రీను, బంగారు లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశం ఉంటే కేరళ రాష్ట్రం వలే పేద ప్రజలకు పదహారు రకాల నిత్యావసర సర కులను పంపిణీ చేయవచ్చునన్నారు. అంతేతప్ప ఈ వ్యవస్థను రద్దు చేయడం సరికాదన్నారు. ఆపరేటర్లు కొవ్వూరు ప్రసాద్, కె.తారకేసు, వజ్రపు వేణు, ఏఐటీయూసీ నాయకులు వాయిబోయిన శేఖర్, కోరిబిల్లి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

కళాసీల సమస్యలపై కలెక్టరేట్ వద్ద ఆందోళన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న కళాసీలు

తుమ్మపాల, మే 26 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) గోడౌన్‌లో పనిచేస్తున్న కళాసీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. కళాసీలతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎగుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా సీడబ్ల్యూసీ గోడౌన్‌లో పెద్ద సంఖ్యలో కళాసీలు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారికి తగినంత పని లేకపోవడంతో పలువురు కళాసీలు ఖాళీగా ఉండిపోతున్నారన్నారు. దీంతో వారికి జీతభత్యాలు అందక ఆయా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. తక్షణమే కళాసీలకు పని కల్పించి ప్రతి నెలా జీతాలు క్రమంగా చెల్లించి ఆదుకోవాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాసీల సంఘం నాయకులు బొండా నూకరాజు, రమణ, అప్పారావు, వీర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలి వెళ్లిన తెలుగు తమ్ముళ్లు

▸▸ జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి టౌన్/తుమ్మపాల, మే 26 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలో మంగళవారం ప్రారంభమయ్యే మహానాడుకు అనకాపల్లి నుంచి సోమవారం టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో నూకాంబిక ఆల యం నుంచి ఆ పార్టీ శ్రేణులు రెండు బస్సులు, 30 కార్లలో బయల్దేరారు. తొలుత ఈ వాహనాలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు జెండా ఊపి ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, మాజీ చైర్మన్ కాయల మురళీ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కర్రి బాబి తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, తుమ్మపాల నుంచి టీడీపీ నాయకులు మహానాడుకు తరలి వెళ్లారు. తొలుత వీరి వాహనాలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు కర్రి బాబి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెక్కల శ్రీనివాసరావు, బత్తుల రమేష్, సైనిక్ తదితరులు పాల్గొన్నారు.



తుమ్మపాల నుంచి బయల్దేరి వెళుతున్న శ్రేణులు

స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల తొలగింపు తగదు

తుమ్మపాల, మే 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్ ప్లాంటులో రెండు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం అన్యాయమని సీపీఐ జిల్లా నాయకుడు వైఎస్ భద్రం అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన అఖిలపక్ష నాయకుల సమావేశంలో మాట్లాడారు.కూటమి అధికారం చేపట్టక ముందు స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కానివ్వబోమని హామీ ఇచ్చి, నేడు విస్మరిస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించడంతో వారి కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అఖిలపక్ష నాయకులు కోరిబిల్లి శంకర్రావు, కొణతాల హరనాథబాబు, మత్తుర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'రాంకీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి'

పరవాడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న రాంకీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాంకీ నిర్లక్ష్యం కారణంగానే ఆదివారం వ్యర్థ జలాల పైపులైన్ లీకేజీ ఏర్పడిందన్నారు. ఇష్టానుసారంగా వ్యర్థ జలాలను గెడ్డలు, చెరువుల్లోకి విడిచిపెట్టడంతో ఈ ప్రాంతం పూర్తిగా కాలుష్యమైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు యాజమాన్యానికి తొత్తులుగా మారారన్నారు.

వేలం నోటీసు

మహారాజశ్రీ అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో
EP 8/2023 in OS 164/2015
Between
బొడ్డేటి శంకరరావు
S/o (లేటు) బి. ప్రకాశరావు, వయస్సు: 49 సం॥లు, R/at డో.నెం. 53-17-61/1, క్రిష్ణ కాలేజ్ దగ్గర, మద్దిలపాలెం, విశాఖపట్నం ...D.Hr
and
(1) బుద్ద దేవి ప్రసాద్, S/o బి.సత్యనారాయణ, వయస్సు: 38 సం॥లు, డో.నెం. 14-16-21/1, గౌరి గ్రంథాలయం వీధి, గవరపాలెం, అనకాపల్లి, విశాఖపట్నం.
(2) బుద్ద శ్రీనివాసరావు, S/o (లేటు) అప్పారావు (RTC), డో.నెం. 14-9-15, నిదానందొడ్డి, గవరపాలెం, అనకాపల్లి. ...J.Dr's

యీ దిగువ వుదహరించిన షెడ్యూలు దాఖలా ఆస్తి యిందు 2వ J.Drకు చెందినది అయిఉండి శ్రీ కోర్టువారి ఆదేశానుసారము తేది. 16-06-2025న ఉ॥ గం॥ 10.30 ని॥ల నుండి సా॥ 5.00 గంటలలోగా వేలం వేయుటకు నిర్ణయించిరి. కావున వేలం పాటలో పాల్గొనదలచినవారు కోర్టులో స్వయంగా హాజరయి శ్రీ కోర్టువారి నిబంధనలను అనుసరించి షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలంలో కొనుగోలు చేయగలందులకు యావన్మంది ప్రజానీకానికి యిందుమూలంగా తెలియపర్చడమైనది.

షెడ్యూలు ఆస్తి వివరము: విశాఖపట్నం జిల్లా, ప్రస్తుతం అనకాపల్లి జిల్లా, అనకాపల్లి సబ్ రిజిస్ట్రీ, అనకాపల్లి - చెర్లోపలఖండం- R.S. వార్డు, జె.డి.నెం. 823, సర్వే నెం. 247లో చేరిఉన్న 3 అయిటమ్‌ల ఆస్తి వివరములు.

అయిటమ్ నెం.1: ఎ.0.46 సెంట్లు పల్లం భూమికి హద్దులు: తూర్పు: వై. సూర్యప్రకాశరావు గార్కి చెందిన జిరాయతీ పల్లం, పడమర: కె. క్రిష్ణకుమారి గార్కి చెందిన జిరాయతీ పల్లం, ఉత్తరం: కె. ఆదినారాయణ గార్కి చెందిన జిరాయతీ పల్లం, దక్షిణం: కె. నరసింహమూర్తి గార్కి చెందిన జిరాయతీ పల్లం.
D.Hr. విలువ: రూ. 46,00,000/-
మార్కెట్ విలువ: రూ. 55,20,000/-

అయిటమ్ నెం.2: ఎ. 0.20 సెంట్లు పల్లం జిరాయతీ భూమికి హద్దులు: తూర్పు: వై. సూర్యప్రకాశరావు గారి జిరాయతీ పల్లం భూమి, పడమర: కె. క్రిష్ణమూర్తి గారి జిరాయతీ పల్లం భూమి, ఉత్తరం: వై. సూర్యప్రకాశరావు గారి జిరాయతీ పల్లం భూమి, దక్షిణం: పి. వరహాలు గారి జిరాయతీ పల్లం భూమి.
D.Hr. విలువ: రూ. 26,00,000/-
మార్కెట్ విలువ: రూ. 31,20,000/-

అయిటమ్ నెం.3: ఎ.0.12 సెంట్లు పల్లం జిరాయతీ భూమికి హద్దులు: తూర్పు: వై. సూర్యప్రకాశరావ గారి జిరాయతీ భూమి, పడమర: కె. క్రిష్ణమూర్తి గారి జిరాయతీ భూమి, ఉత్తరం: కె. ఆదినారాయణ గారి జిరాయతీ పల్లం, దక్షిణం: యితరులకు చెందిన జిరాయతీ పల్లం.
D.Hr. విలువ: రూ. 12,00,000/-
మార్కెట్ విలువ: రూ. 14,40,000/-

(BY ORDER OF THE COURT)
P.V.S.J. MOHAN RAO
M.Com, BL
Advocate
అనకాపల్లి
తేది. 26-05-2025
D.No. 10-19-1, Neyyala Veedhi, Anakapalli-531001.
Cell: 9949450950

పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల సందడి



బయ్యవరం హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కశింకోట, మే 26 (ఆంధ్రజ్యోతి) : పూర్వ విద్యార్థులు పలు పాఠశాలల్లో సందడి చేశారు. కశింకోట మండలం బయ్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004- 2005 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతా సోమవారం కలుసుకున్నారు. దీంతో వారి ఆనందానికి అవధులు లేవు. తొలుత పాఠశాల ఆవరణలో గల సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు వైద్యనాదం, కృష్ణారావు, ఆనందరావు, నాగకుమారి, నాగలక్ష్మి, కేశవరావు, పార్వతీదేవి, చల్లారావు, జోగినాయుడులను సత్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో సహపంక్తి భోజనాల చేసి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆర్.సీతాపతి, ఎ.మధుబాబు, కె.హరి, కె.వెంకన్న, శ్రీను, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



నర్సింగబిల్లి హైస్కూల్‌లో కలుసుకున్న 2007-08 టెన్త్ బ్యాచ్

నర్సింగబిల్లిలో..

నర్సింగబిల్లి హైస్కూల్‌లో 2007-08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా ఆదివారం కలుసుకున్నారు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. అనంతరం సమావేశమై సామాజిక సేవ చేయాలని తీర్మానించుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.



పరవాడ మండలం వాడచీపురుపల్లి హైస్కూల్‌లో..

వాడచీపురుపల్లిలో...

పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి హైస్కూల్‌లో 1995-96 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి స్మృతులను నెమరువేసుకున్నారు. ఎవరెవరు ఏఏ రంగాల్లో కొనసాగుతున్నారో తెలుసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కన్నూరు శ్రీనివాసరావు, కణితి సోమేశ్వరరావు, రామునాయుడు, బండారు ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఐపీపీబీ ఖాతాదారులు ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలి'

చింతపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంక్ ఖాతాదారులందరూ ఎన్‌పీసీఐ లింకింగ్ చేయించుకోవాలని అనకాపల్లి పోస్టల్ సూపరింటెండెంట్ చుక్క శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో నున్న 45 ఉప తపాలా కార్యాలయాలు, రెండు ప్రధాన కార్యాలయాలు, 559 శాఖ తపాలా కార్యాలయాల్లో ప్రభుత్వ పథకాల నగదు డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఖాతాలో జమ చేసేందుకు అనువుగా ఎన్‌పీసీఐ చేయడం జరుగుతుందన్నారు. ఖాతాదారులు ఎన్‌పీసీఐ చేయించుకోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల నుంచి పంపిణీ చేయబోతున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ప్రోత్సాహక నగదు నేరుగా ఖాతాలకు సులభంగా జమకావడం జరుగుతుందన్నారు. ఈమేరకు ఇప్పటికే ఖాతా కలిగివున్న ఖాతాదారులు సమీపంలోనున్న తపాలా కార్యాలయానికి వెళ్లి ఎన్‌పీసీఐ చేయించుకోవాలన్నారు. కొత్తగా ఖాతా తెరచిన వ్యక్తులు కూడా ఎన్‌పీసీఐ చేయించుకోవాలన్నారు.

'ఆరోగ్యానికి యోగా మంచి వ్యాయామం'



యోగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు

చింతపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి యోగా మంచి వ్యాయామమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి అన్నారు. సోమవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా డిగ్రీ కళాశాల విద్యార్థులకు యోగాలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల శారీరిక ధృఢత్వం, మంచి ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతి రోజు 30 నిమిషాలు యోగా చేసే వ్యక్తులకు వ్యాధులు దూరంగా వుంటాయన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసపాత్రుడు, ఎన్ఎస్ఎస్ పీవోలు ఈశ్వర్, పూర్ణరావు, రవీంద్రబాబు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి : సీఐ



గిరిజనులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ కూర్మారావు

గూడెంకొత్తవీధి, మే 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని చింతపల్లి ఎక్సైజ్ సీఐజె.కూర్మారావు అన్నారు. సోమవారం అసరాడ గ్రామంలో సారాకు వ్యతిరేకంగా తహసీల్దార్ టి. రామకృష్ణ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. సారాను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు.సారా వల్ల కలిగే దుష్ఫలితాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నాటు సారా తయారీ, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గిరిజనులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ డీవీవీ సత్యనారాయణ, ఎస్ఐ అప్పలసూరి, ఎక్సైజ్ ఎస్ఐ రాంబాబు, హెడ్‌కానిస్టేబుళ్లు రమేశ్, నాయుడు, సర్పంచ్ లక్ష్మి, వీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

లువ్వాసింగి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంపై గిరిజనుల నిరసన



లువ్వాసింగి సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

జి.మాడుగుల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లువ్వాసింగి సచివాలయంలో సోమవారం డిజిటల్ అసిస్టెంట్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీలోని పలు గ్రామాల నుంచి ప్రజలు రేషన్ కార్డుల నవీకరణకు సచివాలయానికి వచ్చారు. సచివాయంలో డిజిటల్ అసిస్టెంట్ అందుబాటులో లేకపోవడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు సేవలు పొందకుండానే వెనుదిరిగారు. దీంతో వీరంతా స్థానిక కూటమి నేతలకు ఫిర్యాదు చేశారు. అయితే సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సెలవులో ఉన్నందున సమస్య ఏర్పడిందని సచివాలయ ఉద్యోగులు కూటమి నాయకులకు వివరించారు.

విభిన్న ప్రతిభావంతుల గుర్తింపునకు ఇంటింట సర్వే

కశింకోట, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో విభిన్న ప్రతిభావంతుల గుర్తింపునకు సోమవారం ఇంటింట సర్వే చేపట్టారు. జిల్లా కో-ఆర్డినేటర్ శకుంతల బృందం ఇంటింటికీ వెళ్లారు. సత్తమ్మతల్లి కాలనీలో విభిన్న ప్రతిభావంతులను గుర్తించారు. వీరిని భవిత కేంద్రంలో చేర్పించి అవసరమైన వసతి సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు బి.వి.రమణమ్మ, ఎస్.దీప పాల్గొన్నారు.

యోగాంధ్ర కోసం సమన్వయంతో పనిచేయాలి

నక్కపలి మే 26 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర-2025 కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ డి.సీతారామరాజు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర -2025పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, విద్యా, రెవెన్యూ, మండల పరిషత్, ఉపాధి పథకం, వైద్యఆరోగ్యశాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో యోగాంధ్రను జయప్రదం చేయాలన్నారు. అదేవిధంగా తహసీల్దారు నరసింహమూర్తి మాట్లాడుతూ యోగాంధ్ర యాప్‌లో నమోదు చేసుకున్న వారంతా ఒక్కొక్కరూ 50 మందితో రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశించారు. సమావేశంలో ఆయుష్ డాక్టర్ కె.రఘు, ఎంఈఓ కె.నరేష్, తెలుగు పండిట్ ఎన్‌వీఎస్.ఆచార్యులు, యోగా గురువు డి.రాంబాబు, ఉపాధ్యాయులు అప్పలరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా యోగా సాధన

» జిల్లాలో యోగాంధ్ర- 2025పై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ.. » యోగా నోడల్ అధికారి నియామకం



రంపచోడవరంలో యోగా సాధన చేస్తున్న మహిళలు



జీకేవీధిలో యోగా చేస్తున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు

(ఆంధ్రజ్యోతి/పాడేరు)

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర- 2025 అమలుపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నది. దీంతో ఈనెల 20 తేదీ నుంచి వాడవాడలా యోగా సాధన కొనసాగుతున్నది. ముఖ్యంగా జూన్ 21న విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంల్లో జిల్లా నుంచి అధిక సంఖ్యలో భాగస్వామ్యం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకుగానూ గిరిజన సంక్షేమ శాఖకు చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్.లోకేశ్వరరావును యోగా నోడల్ అధికారిగా నియమించారు. ఆయన సారథ్యంలో జిల్లాలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువత, ప్రజలు యోగా సాధనలో భాగస్వామ్యమవుతున్నారు. అందులో భాగంగా సోమవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని పాడేరు, జీకేవీధి, చింతూరు, కూనవరం, రంపచోడవరం, హుకుంపేట, చింతపల్లి, గంగవరం, మారేడుమిల్లి, పెదబయలు మండలాల్లో వెలుగు సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు యోగా సాధనలో భాగస్వామ్యయ్యారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు

పాడేరు, అరకులోయ, రంపచోడవరం నియోజకవర్గాల నుంచి తరలివెళ్లిన నేతలు, కార్యకర్తలు

పాడేరు/రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి పెద్దపండుగగా భావించే మహానాడులో పాల్గొనేందుకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు సోమవారమే కడపకు తరలివెళ్లాయి. ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడుకు జిల్లాలోని పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో నేతలు, కార్యకర్తలు తరలించేందుకు పాడేరు, అరకులోయ అసెంబ్లీ ఇన్‌చార్జిలు గిడ్డి ఈశ్వరి, సియ్యారి దొన్నుదొర, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఏర్పాట్లు చేశారు. ఈప్రాంతాల నుంచి కడప ప్రాంతం చాలా దూరమైనప్పటికీ పార్టీకి చెందిన ప్రధానమైన కార్యక్రమం కావడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు మహానాడుకు తరలివెళ్లారు. మహానాడుకు భారీగా పాడేరు నియోజకవర్గం నుంచి తరలి వెళుతున్న బస్సులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కడపలో మూడు రోజులు నిర్వహించే మహానాడుకు పాడేరు నియోజకవర్గం నుంచి 150 మంది ముఖ్యనాయకులు, కార్యకర్తలు తరలివెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గంగపూజారి శివకుమార్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి బుద్ద జ్యోతికిరణ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రొబ్బి రాము, టీడీపీ మండల అధ్యక్షుడు కూడి రామునాయుడు, పారిజాతం, అప్పలకొండ, లకే పార్వతమ్మ, రాజేష్, బాబు, రవి, వెంకటేశ్వర్లు, సింహాచలం, బొజ్జన్న, కొండబాబు పాల్గొన్నారు.



పాడేరులో మహానాడు బస్సుకు జెండా ఊపుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలకు ప్రణాళికలు

» హెచ్‌ఎంలకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం

పాడేరురూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): రానున్న విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ పలితాలు సాధనకు ఇప్పటి నుంచే సూక్ష్మప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం స్థానిక కాఫీహౌస్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంల వర్క్‌షాపులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు అసంతృప్తిగా ఉన్నాయన్నారు. వచ్చే ఏడాదికి ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. ప్రతీ పాఠశాల వారీగా ఫలితాల్లో వెనుకబాటును గుర్తించి ఆయా సబ్జెక్టుల వారీగా వెనుకబాటుకు కారణాలను విశ్లేషించుకోవాలన్నారు. జూన్ 3 నుంచి 10వ తేదీలోగా విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించి గ్యాప్‌లను గుర్తించాలని, విద్యార్థుల లెర్నింగ్ స్కిల్స్ మెరుగుపర్చాలని, ఉపాధ్యాయులు బోధన స్కిల్స్ మెరుగుపర్చుకోవాలని సూచించారు.

ఏ సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులను ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాలన్నారు. తద్వారా ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలన్నారు. ఈ వర్క్ షాపులో ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో డాక్టర్.ఎంజే.అభిషేక్ గౌడ, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజని, డీఈవో పి.బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

» ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజయ్‌శర్మ

పాడేరురూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజయ్‌శర్మ అన్నారు. సోమవారం ఆయన పాడేరు మెడికల్ కళాశాలను గిరిజన సంఘం నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.హేమలతతో కళాశాలలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి 100 మంది మెడికల్ విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కళాశాలలో 180 పోస్టులకు గాను 79 పోస్టులను మాత్రమే భర్తీ చేశారన్నారు. మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న అజయ్‌శర్మ, తదితరులు

68 మందికి వైద్య సేవలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిముఖిపుట్టు సచివాలయం పరిధిలో మొక్కాపుట్టు, బర్రెంగుల, దాలసరిపుట్టు, గేదలబంద గ్రామాల్లో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. ఆయా శిబిరాల్లో వివిధ వ్యాధులతో బాధపడుతున్న 68 మందికి ఆరోగ్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వైద్య సేవలను అందించారు. వారిలో జ్వరాలతో బాధపడుతున్న ఐదుగురికి జ్వర నిర్ధారణకు రక్త పరీక్షలు చేయగా, సాధారణ జ్వరాలుగా తేలిందని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మోహన్‌రావు, అశోక్‌కుమార్, ఈశ్వరమ్మ, జయసుధ, మత్య కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు నేత్ర పరీక్షిస్తున్న డాక్టర్ నిఖిల్, సిబ్బంది

పెదబయలు, మే 26 (ఆంధ్రజ్యోతి): పెదబయలు, గోమంగి పీహెచ్‌సీల్లో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 160 మందికి పరీక్షలు చేశారు. పెదబయలు పీహెచ్‌సీ పరిధి నుంచి మొత్తం 120 మందికి, గోమంగి పీహెచ్‌సీ పరిధిలో 40 మందికి నేత్ర తనిఖీలు చేశారు. వారిలో పెదబయలు పీహెచ్‌సీలో 80 మంది కంటి శుక్లాలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. రెండు పీహెచ్‌సీల నుంచి 58 మందిని నేత్ర శస్త్ర చికిత్సల కోసం విజయనగరంలోని వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రికి బస్సులో తరలించిన డాక్టర్ నిఖిల్ తెలిపారు. కార్యక్రమంలో టెక్నీషియన్లు సాయి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

90 శాతం రాయితీతో వరి విత్తనాలు

అరకులోయ, మే 26 (ఆంధ్రజ్యోతి): గిరిరైతులకు ప్రభుత్వం 90 శాతం రాయితీతో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నదని మండల వ్యవసాయ శాఖ అధికారి ఫణీంద్రవర్మ తెలిపారు. అరకులోయ ప్రాంతంలో అన్ని రకాల విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జెరాక్సు కాపీలతో రైతుసేవా కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు. ఈ విత్తనాలను మంగళవారం నుంచి పంపిణీ చేస్తామన్నారు. ప్రస్తుతం రెండు రకాల వరి విత్తనాలు 50 టన్నులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'ఎండీయూ వ్యవస్థ రద్దు అమానుషం'

అనంతగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ వ్యవస్థ రద్దు చేయడం అమానుషమని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. మండల కేంద్రంలోని వైసీపీ మండల అధ్యక్షుడు కొర్రా సూర్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రేషన్ పంపిణీ ఎండీయూ వాహనాలు ద్వారానే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎండీయూ వ్యవస్థను కొనసాగింపకపోతే ఆపరేటర్ల కుటుంబాలు రోడ్డునపడతాయని వాపోయారు. ఈ కార్యక్రమంలోని ఎంపీటీసీ సభ్యుడు అశోక్, సర్పంచ్ అప్పలమ్మ, నాయకులు నవీన్, సుబ్బారావు, కొండప్ప, డొంబు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

డుంబ్రిగుడ, మే 26 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని సర్పంచ్ కొములు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొములు నాయుడు అన్నారు. మండలంలోని కొర్రాయి పంచాయతీ బోందుగుడలో సమ్మర్ క్రికెట్ టోర్నీని సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడుదోత పట్టకుండా క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు ముకుంద, గిరిజన యువకులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న సర్పంచ్ కొములు

చింతపల్లి జీసీసీ బ్రాంచి మేనేజర్‌గా సుగునాథం



మేనేజర్ సుగునాథంకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

చింతపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి):స్థానిక గిరిజన సహకార సంస్థ బ్రాంచి మేనేజర్‌గా చల్లంగి సుగునాథం నియమితులయ్యారు. చింతపల్లి బ్రాంచి మేనేజర్ పోస్టు రెండేళ్లగా ఖాళీగా వుంది. దీంతో డీఎం పి.దేవరాజు అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. తాజా బదిలీల్లో పాడేరు డివిజనల్ మేనేజర్ కార్యాలయంలో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సుగునాధంని చింతపల్లి బ్రాంచి మేనేజర్‌గా నియమిస్తూ జీసీసీ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు సోమవారం బ్రాంచి మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన నూతన మేనేజర్‌కి ఎంఎల్ఎస్ గోదాము ఇన్‌చార్జి రమణమూర్తి, గ్యాస్ ఇన్‌చార్జి ఎల్. రమణమూర్తి, సీనియర్ సేల్స్‌మన్ శెట్టి చిన్నబ్బాయి, డీఈవో భారతి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

'అన్యాక్రాంత భూములను ప్రభుత్వానికి అప్పగించాలి'

జి.మాడుగుల, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆక్రమణలకు గురైన భూములు ప్రభుత్వానికి అప్పజెప్పాలని పెసా మండల కమిటీ అధ్యక్షుడు లకే రామకృష్ణ కోరారు. సోమవారం జరిగిన పెసా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరైతే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేశారో వారు ఈనెల 30లోపు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో పెసా కమిటీ నాయకులు సాగిన బాలకృష్ణ, బి.అప్పన్నదొర, పెద్దబ్బాయి, క్రాంతికుమార్, బీవీ దొర, చంటిబాబు పాల్గొన్నారు.

'ఎండీయూను కొనసాగించాలి'

జి.మాడుగుల, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఎండీయూను కొనసాగించాలని వైసీపీ నియోజకవర్గ కన్వీనర్ సాగిన లక్ష్మణ్‌పడాల్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ఎండీయూను రద్దు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా 9,260 మంది ఆపరేటర్లతోపాటు హెల్పర్లు రోడ్డునపడే అవకాశం ఉన్నదని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం పునః పరిశీలన చేయాలని ఆయన కోరారు.

ప్రతీ మండలంలో గురుకులాలు ఏర్పాటు చేయాలి

పాడేరురూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలోని ప్రతీ మండలంలో గురుకుల పాఠశాల, కళాశాలలను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ డిమాండ్ ఒక ప్రకటనలో చేశారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 27, 28 తేదీలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ అవకాశం కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతంలో పేద విద్యార్థులు చదువుకోవాలన్న ఆశ ఉన్నప్పటికీ.. సీట్లు లభించకపోవడంతో డ్రాపౌట్స్‌గా మిగిలిపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రాంతంలో విద్యా ప్రమాణాలు మెరుగుకు ప్రతీ మండలంలో గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిచ్చే తల్లిదండ్రులపై చర్యలు

» కౌన్సెలింగ్‌లో సీఐ దీనబంధు హెచ్చరిక



మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ దీనబందు

పాడేరురూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) మైనర్‌లు నడిపేందుకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని సీఐ డి.దీనబంధు హెచ్చరించారు. సోమవారం చేపట్టిన తనిఖీల్లో ద్విచక్రవాహనాలను నడుపుతున్న మైనర్లను పట్టుకున్న పోలీసులు వారి వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనాలు నడిపిన చిన్నారుల తల్లిదండ్రులను స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. పెద్దలు వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎల్.సురేష్ పాల్గొన్నారు.

పంతలచింతలో డయేరియా



డయేరియాతో చికిత్స పొందుతున్న జమున

డుంబ్రిగుడ, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతంగి పంచాయతీ పంతలచింత గ్రామంలో డయేరియా ప్రబలింది. గ్రామంలోని గిరిజన కుంటుబాలు వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్నారు. జన్ని జమున ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుంది. గ్రామంలోని బావిలో నీరు కలుషితం కావడంతోనే డయేరియా ప్రబలిందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పంతలచింతలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు

రూ.7 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ బంగారమ్మ

ముంచంగిపుట్టు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబుసాల పంచాయతీ కేంద్రం నుంచి సిరగంపుట్టు, జడిగూడ, బొండాపుట్టు గ్రామాలను చేపడుతున్న నూతన రహదారి పనులను సర్పంచ్ ఎం.బంగారమ్మ సోమవారం ప్రారంభించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.7 కోట్లు వెచ్చించి సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేరకు నూతన రహదారి నిర్మాణ పనులను చేపడుతున్నారు. పనుల్లో నాణ్యత పరిమాణాలను పాటిస్తూ, సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు ఎం.రాజేంద్రప్రసాదు, అప్పారావు, ఉప సర్పంచి గణపతి తదితరులు పాల్గొన్నారు.

రహదారులు అధ్వానం.. రాకపోకలు నరకం!

కృష్ణాదేవిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మార్గాలు చిత్తడయ్యాయి. వర్షాలకు గతుకుల్లో నీరు చేరిపోయి చెరువులను తలపిస్తున్నాయి. ఎక్కడ గొయ్యి ఉందో తెలియని దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. వాహన చోదకులు, ప్రయాణికుల రాకపోకలకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నాయి.

గొలుగొండ మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. పాత కృష్ణాదేవిపేట-పల్లావూరు, చోద్యం, రామచంద్రపురం, లింగంపేట తదితర గ్రామాలకు ఎళ్లే రహదారుల గోతుల్లో వర్షం నీరు చేరి ప్రమాదకరంగా తయారయ్యాయి. వర్షంనీరు గోతుల్లో ఉండడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాల బారినపడిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారులను మెరుగుపర్చాలని వారు కోరుతున్నారు.

తాండవ మార్గం.. భయంభయం

నాతవరం, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండవ-నాతవరం రహదారి దారుణంగా తయారైంది. మూడు మండలాలకు చెందిన 16 గ్రామాలకు ఉపయోగపడే ఈ రోడ్డు మరమ్మతు చేపట్టకుండా వదలివేస్తే ఎలా అని ఈ ప్రాంత గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు మండల కేంద్రం నాతవరం నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తాండవ రోడ్డుకు పదేళ్ల నుంచి కనీస మరమ్మతులు చేపట్టలేదు. నీటిపారుదల శాఖ ఆధీనంలో ఉండడంతో నిధులు రావడం లేదు. పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ఆర్టీసీ బస్సులు వెళ్లడం కష్టంగా మారింది. తాండవ రోడ్డు వెంబడే గొలుగొండ మండలానికి, అలాగే కొయ్యూరు మండలాలకు వెళ్లాలి. అలాగే చమ్మచింత తాండవ, మాధవనగరం ఆడాకుల తదితర 16 గ్రామాల ప్రజలకు తాండవ రోడ్డే శరణ్యం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తాండవ రోడ్డు గోతులను అప్పటి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, జనసేన నాయకులుకప్పి నిరసన తెలిపారు. నర్సీపట్నం, ఇతర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులలో తాండవ మార్గంలోనే వెళ్లాలి. కళాశాల విద్యార్థులకు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగే గతంలో చాలాసార్లు ఈ రోడ్డు గోతులలో బస్సు దిగిపోయింది. అధికారులు తక్షణమే స్పందించి తాండవ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

వర్షాలతో గ్రామీణ మార్గాలు ఛిద్రం

రోడ్ల గతుకుల్లో చేరిన నీరు చేరి చెరువులను తలపిస్తున్నవైనం

బిక్కుబిక్కుమంటూ వాహన చోదకులు, ప్రజల ప్రయాణం



వర్షాలకు చిత్తడిగా మారిన తాండవ రహదారి ఇదే...





వర్షం నీరు చేరి చెరువును తలపిస్తున్న లింగంపేట రోడ్డు... ఏఎల్‌పురం గొల్లవీధిలో బురదమయమైన రోడ్డు

ప్రజా ఫిర్యాదుల వేదికకు 11 అర్జీలు



వినతిపత్రాలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రామారావు

నర్సీపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తొమ్మిది వినతి పత్రాలు వచ్చాయి. ఆర్డీవో వీవీరమణ అనకాపల్లి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లడంతో నర్సీపట్నం తహసీల్దార్ రామారావు అర్జీలను స్వీకరించారు. వీటిలో ప్రధానంగా నాతవరం మండలం గుమ్మిడిగొండలో సర్వే నంబరు 102/2లో 1.25 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, కబ్జాదారులకు రెవెన్యూ సిబ్బంది సహాయ సహకారాలు అందిస్తున్నారని సర్పంచ్ పంచాడ పాప, ఎంపీటీసీ సభ్యులు సుర్లపాత ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

ఘనంగా సత్యసాయి రథయాత్ర



దేవరాపల్లి: సత్యసాయి ప్రవహిణి రథయాత్రలో భక్తులు

మాడుగుల/దేవరాపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి ప్రవహిణి రథయాత్ర ఘనంగా జరిగింది. సత్యసాయి వందో జయంతి సందర్భంగా ప్రారంభించిన ఈ రథయాత్ర సోమవారం మాడుగుల, దేవరాపల్లి మండల కేంద్రాలకు చేరుకుంది. సత్యసాయి భజన పాటలతో పురవీధుల మీదుగా స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, జోన్ ఇన్‌చార్జి లోవరాజు, జిల్లా ప్రతినిధులు రవిశంకర్, కృష్ణంరాజు, కామరాజు, రాజశేఖర్, శివరామకృష్ణ, రమామణి, మాడుగుల సమితి కన్వీనర్ కె.శ్రీనివాసరావు, పి.బలరాం, రజకొండ పాల్గొన్నారు.

యోగాపై ప్రతీ సచివాలయంలో శిక్షణ



యోగాపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

మాడుగుల, మే 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ సచివాలయం పరిధిలో యోగాపై శిక్షణ ఇస్తామని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. సచివాలయాల్లో ఒక్కో ఉద్యోగి 150 మందికి శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. అనుభవం కలిగిన నలుగురు మాస్టర్లు శిక్షణ ఇవ్వడానికి వచ్చారన్నారు. ఇందులో భాగంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో యోగా ఏ విధంగా శిక్షణ అందించాలనే అంశంపై అవగాహన కల్పించారు.

రాయితీపై పాడి రైతులకు పశు దాణా



రాయితీపై పశు దాణాను రైతులకు పంపిణీ చేస్తున్న ఏడీ పుష్ప

రావికమతం, మే 26 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశు దాణా పంపిణీ చేస్తున్నామని పశు సంవర్ధక శాఖ ఏడీ టి.పుష్ప సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.1100 విలువైన 50 కిలోల దాణా బస్తాను రూ.550కే ప్రభుత్వం సరఫరా చేస్తున్నదని చెప్పారు. మొదటి విడతగా రావికమతం, రోలుగుంట మండలాల పరిధిలో 17 టన్నుల పశు దాణాను వచ్చిందన్నారు. ఈ దాణాను ఒక్కొక్క రైతులకు 50 కిలోల చొప్పున అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత వేపాడ నాగేశ్వరావు, జనసేన నేత శంకర్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందులను అరికట్టండి

▸▸ వ్యవసాయాధికారులకు రైతు సంఘం నేతల ఫిర్యాదు

చోడవరం, మే 26 (ఆంధ్రజ్యోతి): నకిలీ పురుగు మందుల విక్రయాలను అరికట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు కోరారు. ఈ మేరకు సోమవారం ఏవోకు సోమవారం వినతిపత్రం అందించారు. నకిలీ విత్తనాలు, పురుగు మందుల వల్ల రైతులు నష్టాల పాలవుతున్నారని, వీటిని విక్రయించే వ్యాపారులపై పీడీ యాక్టు నమోదు చేయడంతో పాటు లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, పెట్టుబడి ప్రోత్సాహం అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పత్తి సత్తిబాబు, సింగంపల్లి దేమేడు, జోగా శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లాలంటే హడల్..!

▸▸ వర్షాలకు పరిసరాలన్నీ బురదమయం

▸▸ అడుగు పెట్టాలంటేనే ప్రయాణికుల్లో భయం

మాకవరపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ అధ్వానంగా తయారైంది. వర్షాలకు పరిసరాలన్నీ బురదమయమై అస్తవ్యస్తంగా మారాయి. దీంతో బస్టాండ్‌లోకి అడుగు పెట్టాలంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. బస్టాండ్‌లో గోతులు కప్పేందుకు ఇటీవల మట్టిని వేశారు. వర్షాలకు నీరు చేరిపోయి మరలా మూడు నెలలకే గోతులు ఏర్పడ్డాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బస్టాండ్ ఆవరణ మరింత బురదమయమైంది. దీంతో నాలుగు రోజులుగా ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు నిలిపే ప్రదేశం బరదగా మారడంతో బస్సు ఎక్కాలంటే బురదలో నుంచే ఇబ్బందులు పడుతూ ప్రయాణికులు వెళ్లాల్సి వస్తున్నది. సోమవారం కురిసిన వర్షానికి బురద మరింత ఎక్కువ కావడంతో బస్సులు లోపలకు రాకుండా బయట నుంచే వెళ్లిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు బస్సు ఎక్కడ ఎక్కాలో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బస్టాండ్‌లో ఉన్న మట్టిని బయటకు తొలగించాలని, పరిసరాలన్నీ బురద లేకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన బస్టాండ్ పరిసర ప్రాంతం

మహానాడుకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు



మహానాడుకు బయలుదేరిన బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న చింతకాయల పద్మావతి



టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబును కలుసుకుని మహానాడుకు వెళ్తున్న టీడీపీ నాయకులు

నర్సీపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కడపలో జరుగుతున్న మహానాడుకి సోమవారం తరలివెళ్లారు. నర్సీపట్నంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇంటి దగ్గర నుంచి నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం, గొలుగొండ మండలాలకు చెందిన నాయకులు రెండు బస్సులలో బయలుదేరారు. 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. మరికొంత ముఖ్య నాయకులు కార్లలో మహానాడుకు వెళ్లారు.

రోలుగుంట: కడపలో నిర్వహించే మహానాడు కార్యక్రమానికి మండలం నుంచి టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 24 పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.

మాకవరపాలెం: మండలంలోని పలువురు టీడీపీ నాయకులు బస్సులు సొంత వాహనాల్లో మహానాడుకు బయలుదేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, నాయకులు కేతిరెడ్డి చిరంజీవి, లాలం రాము, గౌరీశంకర్, శ్రీను తరలివెళ్లారు.

మాడుగుల రూరల్: తెలుగుదేశం పార్టీ కడపలో నిర్వహించే మహానాడు కార్యక్రమానికి మండలంలోని పలువురు నాయకులు సోమవారం తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, నాయకులు నందారపు సన్యాసిరావు, వడ్డి రాజ్‌కుమార్, పోతురాజు, కొండరావు, సింహాచలం తదితరులు రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఆధ్వర్యంలో బస్సులు, కార్లలో తరలివెళ్లారు.

బుచ్చెయ్యపేట: మండల కేంద్రం నుంచి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో మహానాడుకు అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోరుకొండ రవికుమార్, వడ్డాది టీడీపీ అధ్యక్షుడు దొండా నరేశ్, మాజీ సర్పంచ్ తమరాన దాసు, నాయకులు వియ్యపు అప్పారావు, దొడ్డి కిశోర్, దొండా గిరి, టి.శంకర్, ఎస్.రమేశ్ బయలుదేరారు.

రావికమతం: మండలం నుంచి టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యే రాజు ఆధ్వర్యంలో సోమవారం మహానాడుకు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, నాయకులు గంజి వెంకటరమణ, కేశంశెట్టి శ్రీను, గొర్లె నూకునాయుడు, గల్లా నానిబాబు, పల్లా హరికృష్ణ తదితరులు రెండు బస్సుల్లో బయలుదేరారు.

భారీ వర్షం



రావికమతం మండలం కొమిరలో కురుస్తున్న జోరు వాన

నర్సీపట్నం/నాతవరం/గొలుగొండ/రావికమతం/రోలుగుంట/మాడుగుల, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. నర్సీపట్నం నియోజకవర్గ కేంద్రంతో పాటు నాతవరం, గొలుగొండ, చోడవరం నియోజకవర్గంలోని రావికమతం, రోలుగుంట, మాడుగుల నియోజకవర్గ కేంద్రాల్లో వాన పడింది. నర్సీపట్నంలో సోమవారం తెల్లవారి జామున అరగంట పాటు వర్షం పడి తెరిపిచ్చి మధ్యాహ్నం మోస్తరుగా కురిసింది. ఎన్టీఆర్ మినీ స్టేడియం చిత్తడి చిత్తడిగా తయారై క్రీడాకారులు, వేకువజాము నడకదారులు ఇబ్బంది పడుతున్నారు.



నాతవరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

నాతవరం మండలంలోని పలు గ్రామాల్లో సుమారు గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం పడింది. దీంతో రోడ్లపై నీరు ఏరులై పారింది. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలో నీరు చేరి చిన్న చెరువులను తలపించాయి. గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి.

గొలుగొండ, పాతమల్లంపేట, పాకలపాడు, చీడిగుమ్మల, పప్పుశెట్టిపాలెం, జోగంపేట, అమ్మపేట, కొత్తమల్లంపేట గ్రామాల్లో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి జల్లులు పడ్డాయి. రోలుగుంట మండలంలోని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసినప్పటికీ వాతావరణం ఒక్కసారిగా మారిపోయి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. బీఎన్ రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. రావికమతం మండలంలో రోజూ వర్షాలు దంచికొడుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ప్రధాన, గ్రామీణ రోడ్లు ఛిద్రమయ్యాయి. నర్సీపట్నం-భీమునిపట్నం రోడ్డు ఈ వర్షాలకు మరింత అధ్వానంగా మారి వాహనాలకు, ప్రయాణికులకు నరకం చూపిస్తున్నది. మాడుగుల కేంద్రంలో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. రోజంతా వాతావరణంతో మబ్బులు కమ్మేసి చీకటి అలముకుంది.

అసంపూర్తిగా సచివాలయ భవనాలు

▸▸ ఇరుకు గదుల్లోనే ఉద్యోగుల విధులు

గొలుగొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గ్రామ సచివాలయ, రైతు సంక్షేమ భవనాలు పూర్తికాలేదు. దీంతో చాలీచాలని గ్రామ పంచాయతీ భవనంలోనే ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఆ భవనం కూడా శిథిలావస్థలకు చేరడంతో నిరంతరం ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు, రైతు సంక్షేమ భవనానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. 2022లో ఈ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. కొంతవరకూ బాగానే పనులు జరిగాయి. తర్వాత అరకొరగా బిల్లులు మంజూరు కావడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. దీంతో భవనాలు పూర్తికాక గ్రామ పంచాయతీ భవనంలోనే ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఆ భవనంలోని గదులు ఇరుకుగా ఉండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ భవనాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఉద్యోగులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



గొలుగొండలో అసంపూర్తిగా నిలిచిపోయిన సచివాలయ భవనాలు

భమిడిపాటి సత్రం భూములకు కౌలు వేలం రేపు

చోడవరం, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భమిడిపాటి సత్రంకు చెందిన భూములకు ఈ నెల 29న జన్నవరం, హార్డింజి అతిథి గృహాల వద్ద కౌలు వేలం నిర్వహిస్తామని దేవదాయ శాఖ ఈవో ఎస్‌వీవీ.సత్యనారాయణ తెలిపారు. మూడేళ్ల కాలానికి నిర్వహిస్తున్న ఈ కౌలు వేలంలో పాల్గొనదలచిన రైతులు వేలంలో పాల్గొనవచ్చని ఆయన సూచించారు.

నేడు సన్యాసమ్మ ఒడ్డు పండుగ



దేవరాపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిన్నంనాయుడు కాలనీలో సన్యాసమ్మ గ్రామ దేవత ఒడ్డు పండుగ మంగళవారం జరుగుతుందని ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి చంద్రరావు సోమవారం తెలిపారు. ఉదయం నుంచి దూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

యోగా గురువు సతీశ్‌కు ఎస్పీ అభినందన



సతీశ్‌ను అభినందిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

చోడవరం, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యోగాకు విశేష ప్రాచుర్యం కల్పిస్తున్న యోగా గురువు, రాష్ట్ర యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పుల్లేటి సతీశ్‌ను జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా సోమవారం అభినందించారు. అనకాపల్లి జిల్లా ఆయుష్ వైద్యాధికారి లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా ఉత్సవాల్లో ఎస్పీ సతీశ్‌ను సత్కరించారు.

నేడు అడ్డసరంలో మోదకొండమ్మ జాతర

రోలుగుంట, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డసరంలో మంగళవారం మోదకొండమ్మ జాతర నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ విశారపు రమణాజీ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాల కోసం ఏర్పాటు చేశామన్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను జరుగుతాయని, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

లేటరైట్ తవ్వకాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

నర్సీపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలంలోని సుందరకోట పంచాయతీ బమిడికలొద్దిలో అక్రమంగా జరుగుతున్న లేటరైట్ తవ్వకాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమావేశంకర గణేశ్ సోమవారం ఒక వీడియో సందేశంలో తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు లేటరైట్ తవ్వకాల ద్వారా రోజుకు రూ.3 కోట్లు అక్రమంగా సంపాదిస్తున్నారని ఆయన ఆరోపించారు. గత నెల 28న ఒక పర్యాయం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మరో సారి ఫిర్యాదు చేశామని తెలిపారు. కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కోర్టును ఆశ్రయిస్తామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులకు జీకే అవసరం

చీడికాడ, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే జనరల్ నాలెడ్జి అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారి ఎంఎల్ఎస్ జోగేశ్వరి తెలిపారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా సోమవారం గ్రంథాలయంలో పలువురు విద్యార్థులతో జనరల్ నాలెడ్జి పుస్తకాలు చదివించారు. అనంతరం వారితో ఆటలు ఆడించారు. వేసవి సెలవులు పూర్తయ్యేవరకూ ప్రతి ఒక్కరూ జనరల్ నాలెడ్జి పుస్తకాలు, పేపర్లు చదివి విజ్ఞానం పెంచుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి యోగా శిక్షణ


చీడికాడ, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు యోగా శిక్షణ ఇస్తామని ఎంపీడీవో వి.హేమసుందర్రావు తెలిపారు. ఈ మేరకు చీడికాడ హైస్కూల్‌లో సోమవారం అన్ని శాఖల ఉద్యోగులతో మండల స్థాయి ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ యోగా జరుగుతుందన్నారు. యోగాతో మానసిక ఉల్లాసం, ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్ కుమార్, అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

వైసీపీ విస్తృత స్థాయి సమావేశం

దేవరాపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తారువ రాజశేఖరరెడ్డి ఆడిటోరియంలో ఆదివారం వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి వైసీపీ విస్తృత సమావేశం జరిగింది. అనకాపల్లి పార్లమెంటు వైసీపీ పరిశీలకులు శోభా హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ పార్టీ పూర్వ వైభవం దిశగా కార్యకర్తలు పయనించాలని సూచించారు. ఉచిత బస్సు, 18 ఏళ్లు దాటిన మహిళకు రూ.1500 ఇస్తామన్న ఎన్నికల హామీలు గాలికి వదిలారని చెప్పారు. ఈ సమావేశంలో బూరే బాబూరావు, వి.సన్యాసినాయుడు, కేవీ.రమణ, రెడ్డి జగన్మోహన్, రాజారామ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ రికార్డు యోగం దక్కేలా

విశాఖలో 5 లక్షల మందితో యోగాసనాలు



» వచ్చే నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహణ
» యోగాంధ్ర యాప్ ద్వారా రిజిస్ట్రేషన్‌కు అవకాశం

నక్కపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరంలో యోగాసనాల ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళిక రూపొందించాయి. జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా 5 లక్షల మందితో యోగాసనాలు వేయించాలని నిర్ణయించాయి. ప్రధాని మోదీ హాజరయ్యే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. మన రాష్ట్రంలో జూన్ 21 నాటికి 2 కోట్ల 10 లక్షల మంది యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏపీలో ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వశాఖలు, ప్రైవేట్ యోగా సంస్థలను యోగాంధ్రలో భాగస్వాములను చేస్తున్నారు.

45 నిమిషాల పాటు యోగా ప్రొటోకాల్

జూన్ 21న విశాఖలో జరగనున్న ప్రపంచ యోగా డే సందర్భంగా 5 లక్షల మంది ఏకకాలంలో ఒకే ఆసనం వేసేందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ ఆయూష్‌శాఖ 45 నిమిషాల సమయంతో కూడిన ప్రొటోకాల్ యోగాను నిర్ణయించారు. గత మూడు రోజుల నుంచి ఈ పద్ధతిలోనే యోగా శిక్షణలు మొదలయ్యాయి.

సులభశైలిలో పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ జూన్ 21న ఆసనాలు వేసేలా, యోగా ప్రొటోకాల్ ఆసనాలున్నాయి. యోగా మాస్టర్ ట్రైనర్లు, ప్రైవేట్ యోగా నిర్వాహకులు, మరికొంతమందికి యోగా ప్రొటోకాల్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఇలా శిక్షణ పొందిన వారంతా గ్రామాల్లో యోగా శిక్షణ ఇవ్వాల్సి వుంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో మంత్రులు, జిల్లా కలెక్టర్లు యోగాంధ్ర కర్టన్ రైజర్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో 100 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. ఒక్కొక్కరూ మండల స్థాయిలో 200 మందికి శిక్షణ ఇవ్వాల్సి వుంటుంది.

మండల పరిధిలో 1.25 లక్షల మంది యోగా శిక్షణ పొందాలని లక్ష్యంగా నిర్ణయించారు.

జిల్లాలో నాలుగు చోట్ల ప్రత్యేక కార్యక్రమాలు

అనకాపల్లి జిల్లాలో ఈ నెల 27 నుంచి జూన్ 15 వరకు ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. జిల్లాలో నాలుగు టూరిజం ప్రాంతాల్లో వేలాది మందితో యోగా కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. మొదటిగా ఈ నెల 27న పరవాడ ముత్యాలమ్మపాలెం, జూన్ 2న కేడీపేట అల్లూరి సీతారామరాజు పార్కు, 9న రాంబిల్లి తీర ప్రాంతం, 15న రేవుపోలవరం బీచ్‌లో ఈ కార్యక్రమాలు జరుగుతాయి. ఒక్కో పర్యాటక ప్రాంతంలో 1000 నుంచి 2 వేల మందితో యోగాసనాలు చేయించనున్నారు.

ఆ ముగ్గురే...


త్రినాథరావు


ఆనంద్‌కుమార్


చంద్రశేఖర ఆజాద్

» 2023 చందనోత్సవం నిర్వహణలో వైఫల్యానికి ఈవో, ఏఈవో, ప్రత్యేక అధికారే కారణం
» కలెక్టర్ అనుమతి లేకుండా రెండు వేలకుపైగా టికెట్లు అదనంగా ముద్రణ
» అంతరాలయ దర్శనాలు ఆపిన తరువాత కూడా విక్రయం
» నాలుగు వీవీఐపీ టికెట్లు, ఒక కారు పాస్ కలిపి రూ.20 వేలు చొప్పున అమ్మకం
» వెలుగుచూసిన నాటి విచారణాధికారి/జేసీ నివేదిక
» చర్యలకు సిఫారసు చేసినా పట్టించుకోని ప్రభుత్వం
» ప్రభుత్వం మారినా ఆ అధికారులు అక్కడే కొనసాగింపు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం చందనోత్సవం నిర్వహణలో విఫలమైన అధికారులపై ప్రభుత్వం ఏనాడూ చర్యలు చేపట్టడం లేదు. ఈ ఏడాది కూడా చందనోత్సవం రోజున గోడ కూలి ఏడుగురు మరణించడంతో అందుకు కారకులైన వారిని మాత్రమే సస్పెండ్ చేసింది. అయితే, ఈసారి కూడా చందనోత్సవం నిర్వహణలో అనేక తప్పులు దొర్లాయి. టికెట్లు లేకుండానే చాలామంది దర్శనాలు చేసుకున్నారు. వేయి రూపాయల టికెట్ల లైన్‌లో రూ.300 టికెట్లు కొన్నవారిని పంపించారు. రూ.1,500 టికెట్ల క్యూలో టికెట్ల పరిశీలన సరిగా చేయలేదు.

2023లో అతి పెద్ద విచారణ

2023లో చందనోత్సవం నిర్వహణలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. ఆ ఏడాది ఏప్రిల్ 23న ఉత్సవం జరగ్గా, తన జీవితంలో అంత దారుణం ఎప్పుడూ చూడలేదని వైసీపీకి అనుకూలమైన శారదా పీఠం స్వామే అసంతృప్తి వ్యక్తంచేశారు. నాటి దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వీవీఐపీలు అందరికీ అంతరాలయ దర్శనం కల్పించాలని పట్టుబట్టారు. ఉదయం ఏడు గంటలకే ముగించాల్సిన అంతరాలయ దర్శనాలు సుదీర్ఘంగా కొనసాగడం వల్ల ఇబ్బందులు తలెత్తాయి. దాంతో నాటి కలెక్టర్ మల్లికార్జున లోపల ఉండి అంతరాలయ దర్శనాలు 10 గంటలకు ఆపించేశారు. ఈ విషయం తెలిసి కూడా ఆలయ ఏఈఓ ఆనంద్‌కుమార్ ఉదయం 10.32 గంటలకు రూ.1,500 వీవీఐపీ టికెట్లు (50) విక్రయించి వారికి 11-12 గంటల స్లాట్‌లో దర్శనాలకు పంపించారు. వీవీఐపీలు రాజగోపురం పక్క నుంచి మెట్ల మార్గంలో పైకి వెళ్లడానికి యత్నించడంతో తొక్కిసలాట జరిగింది. పోలీస్ అధికారులు కుటుంబాలతో సహా టికెట్లు లేకుండా దర్శనాలు చేసుకున్నారు. దీనిపై పెద్ద రచ్చ జరగడంతో ప్రభుత్వం నాటి జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌ను విచారణాధికారిగా నియమించి నివేదిక కోరింది. ఆయన దాదాపు 190 మందిని విచారించి నివేదిక సమర్పించారు. ఆ రోజున ఆయన కూడా కొండపై విధుల్లో ఉండడంతో ప్రత్యక్షంగా అన్నీ చూశారు.

ఆ ముగ్గురే బాధ్యులు

నాటి చందనోత్సవంలో తప్పులు జరగడానికి అప్పటి ఆలయ ఈఓ వి.త్రినాథరావు, ఏఈఓ ఎస్.ఆనంద్‌కుమార్, ఉత్సవ ప్రత్యేక అధికారి చంద్రశేఖర ఆజాద్‌లు కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే దేవస్థానం ఇంజనీర్లు శ్రీనివాసరాజు, డీఈ రాంబాబు భక్తులకు ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యం వహించారని వారిపై కూడా చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు. నాటి ప్రభుత్వం వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పైగా అదే అధికారులు ఇప్పుడూ కొనసాగుతున్నారు. ఈ ఏడాది చందనోత్సవానికి ముందు సెలవుపై వెళ్లిన ఈఓ త్రినాథరావు సోమవారం వచ్చి విధుల్లో చేరారు. ఏఈఓ ఆనందకుమార్ అదే స్థానంలో విధులు వెలగబెడుతున్నారు. ఈఈ శ్రీనివాసరాజు గోడ కూలిన ఘటనలో సస్పెండయ్యారు. డీఈ రాంబాబుపై కూడా చర్యలు లేవు.

టికెట్ల విక్రయమే పెద్ద కుంభకోణం

ప్రతి ఏటా చందనోత్సవం టికెట్ల విక్రయంలో పెద్ద కుంభకోణం జరుగుతోంది. ఈఓ కార్యాలయం వారికి నచ్చినన్ని టికెట్లు ముద్రించి అమ్ముకుంటోంది. 2023లో ఆలయ అధికారులు నాలుగు వీవీఐపీ టికెట్లు, ఒక కారు పాస్ కలిపి రూ.20 వేలు చొప్పున అమ్ముకున్నారు. నాటి టికెట్ల విక్రయంపై జేసీ విశ్వనాథన్ సుదీర్ఘ నివేదిక అందించారు. ఆ ఏడాది చందనోత్సవం టికెట్ల విక్రయం (48,015) ద్వారా రూ.3.78 కోట్ల ఆదాయం సమకూరింది.

- సమన్వయ సమావేశంలో కలెక్టర్ రూ.1,500 విలువ కలిగిన టికెట్లు 5 వేలు మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. ఆ తరువాత మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశంతో మరో వేయి టికెట్లు అదనంగా ప్రింట్ చేయాల్సిందిగా చెప్పారు. కానీ ఆలయ అధికారులు ఉత్సవం రోజున రాజగోపురం వద్ద తొక్కిసలాట జరుగుతున్నా ఉదయం 11 గంటలకు వీవీఐపీ టికెట్లు అమ్ముతూనే ఉన్నారు. ఆరు వేలకు బదులు 8,707 టికెట్లు విక్రయించారు. అదనంగా విక్రయించిన 2,707 టికెట్లకు కలెక్టర్ అనుమతి లేదు. దీనిపైనే ఈఓ, ఏఈఓలపై చర్యలు తీసుకోవాలని జేసీ సిఫారసు చేశారు. అంతకు ముందు ఏడాది 2022లో 31,486 టికెట్లు మాత్రమే విక్రయించగా 2023లో అదనంగా 17 వేలు అమ్మారు.
- వాహనాల పాస్‌లు ఇష్టం వచ్చినట్టు ఉపయోగించుకున్నారు. మొత్తం 697 పాస్‌లు జారీ చేయగా వాటిలో పోలీస్ శాఖ 258 పాస్‌లు తీసుకుందని తేలింది. దీనికి వారి నుంచి సరైన సమాధానం అందలేదు. సిబ్బందికి పాస్‌లు పేరుతో వాటిని వీవీఐపీలకు అమ్ముకున్నట్టు తేలింది.
- ఉత్సవం ప్రత్యేక అధికారిగా నియమితులైన చంద్రశేఖర ఆజాద్ జేసీ విచారణకు హాజరు కాలేదు. తనకు ఉత్సవంలో ఎటువంటి బాధ్యతలు అప్పగించలేదని, అందువల్ల తనకు సంబంధం లేదని సమాధానమిచ్చారు. దీనిని బాధ్యతారాహిత్యంగా పేర్కొంటూ చర్యలకు సిఫారసు చేశారు.

ఇప్పుడైనా స్పందించాలి

చందనోత్సవం నిర్వహణలో పదేపదే తప్పులు చేస్తూ సొంత లాభం చూసుకుంటున్న వారిపై ఇప్పటికైనా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దేవస్థానంలో పాతుకుపోయి, ఏకంగా ఉత్సవానికే చెడ్డపేరు తెస్తున్న వారిని ఇప్పుడు జరుగుతున్న బదిలీల్లో అయినా ఇక్కడి నుంచి పంపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనా, జిల్లా నాయకులపైనా ఉంది.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

» పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ విజయకృష్ణన్


అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందే అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడుతూ, డివిజన్, మండల స్థాయిల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలకు ఆయా అధికారులు తప్పక హాజరయ్యేలా చూడాలని జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. అర్జీలో పేర్కొన్న సమస్యను పరిష్కరించలేకపోతే అందుకుగల కారణాన్ని అర్జీదారునికి తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు డీఆర్ఓ సత్యనారాయణరావు, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి పాల్గొని పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. పలువురి నుంచి ఆయన అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా ఆలకించారు. మొత్తం 40 అర్జీలు అందగా... వీటిని క్షుణ్ణంగా పరిశీలించి లోతుగా విచారణ చేసి అర్జీదారులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైమ్) ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డిపోల్లోనే సరకులు

... 5వ పేజీ తరువాయి

ద్వారా సరకుల పంపిణీని ప్రభుత్వం నిలుపుదల చేసిందని, అందువల్ల కార్డుదారులు తమపరిధిలోని రేషన్ డిపోకు వెళ్లి సరకులు తీసుకోవాలని చెప్పారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు వెసులుబాటు వున్న రోజున కుటుంబ సభ్యుల్లో ఏ ఒక్కరైనా వెళ్లి సరకులు పొందవచ్చునన్నారు. ఆయా తేదీల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచి వుంటాయని వెల్లడించారు. 60 సంవత్సరాల దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఒకటి నుంచి ఐదో తేదీ వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల లోపు వారి ఇంటి వద్దకే వచ్చి సరకులు అందజేస్తారని ఆయన తెలిపారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

ఎస్పీ తుహిన్‌సిన్హా


మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో సోమవారం పోలీస్ అధికారులు ప్రత్యేక యోగా శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల రోజులపాటు నిర్వహించనున్న 'యోగాంధ్ర- 2025'లో భాగం గా యోగా ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవు తున్నారని, రోజూ యోగం చేయడం ద్వారా ఒత్తిడిని అధిగమించ డంతోపాటు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా వుం డవచ్చని ఆయన అన్నారు. రోజూ ఆహారం తీసుకుం టున్నట్టే.. రోజూ యోగా చేయాలని ఎస్పీ సూచించారు. అనంతరం జిల్లా ఆయుష్ విభాగం మెడికల్ ఆఫీసర్ కె.లావణ్య, యోగా గురువులు శ్రీను, చంద్రిక, శివ, సతీశ్, జగన్ తదితరుల మార్గదర్శనంలో పోలీసు అధికారులు, సిబ్బంది యోగాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు బి.మోహనరావు, పి.శ్రీనివాసరావు, వి.విష్ణుస్వరూప్, పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


యోగా చేస్తున్న ఎస్పీ, పోలీస్ అధికారులు, సిబ్బంది

ఇద్దరు యువకుల దుర్మరణం

... 5వ పేజీ తరువాయి

అయ్యారు. చేతికి అందివచ్చిన బిడ్డలను ట్రాక్టర్ రూపంలో వచ్చిన మృత్యువు కబళించిందంటూ రోదించారు. రాయి చిలుకునాయుడు, లక్ష్మిలకు గణేశ్‌తో పాటు కుమార్తె పూజిత వున్నారు. జనపరెడ్డి సత్యారావు, వరలక్ష్మి దంపతులకు సంజీవి ఒక్కడే కుమారుడు. మగ బిడ్డలు శాశ్వతంగా దూరం కావడంతో రెండు కుటుంబాల్లో అంతులేని విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. మంగళవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని చెప్పారు.

ప్రమాదస్థలిలో ట్రాక్టర్, ధ్వంసమైన బైక్



ఆర్ఈసీఎస్ సొమ్ములు స్వాహా

... 5వ పేజీ తరువాయి

సమాధానం ఇవ్వకుండా ఆ లేఖను సింహాచలం డిపోనకు బదిలీ చేశారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి కోట్లాది రూపాయల విలువైన సామగ్రిని అప్పగించడమే కాకుండా ఆ వివరాలు లేవని చెప్పడాన్ని దరఖాస్తుదారు తీవ్రంగా తప్పుబట్టి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

క్రైం... crime news

పాదచారిని ఢీకొన్న ద్విచక్ర వాహనం

» ఇద్దరికి తీవ్ర గాయాలు
» కేజీహెచ్‌కు తరలింపు


గాయపడిన బొజ్జయ్యదొర

చింతపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయలుకించంగి గ్రామంలో నడిచి వెళుతున్న ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో బాటసారితో పాటు వాహనం నడుపుతున్న వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. బయలుకించంగి గ్రామానికి చెందిన ఆదివాసీ ప్రభావిత పథం చర్చి పాస్టర్ తాంగుల బొజ్జన్నదొర చింతపల్లి నుంచి ఆటోలో గ్రామానికి వచ్చారు. ఆటో దిగి ఇంటికి వెళుతున్నారు. ఆ సమయంలో పెదబయలు మండలం గుండాలగరువు గ్రామానికి చెందిన బాబూరావు ద్విచక్ర వాహనంపై చెరుకుంపాకలు వెళుతున్నారు. నడిచి వెళుతున్న బొజ్జన్నదొరను వెనుక నుంచి ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. దీంతో బొజ్జన్నదొర కాలు విరిగిపోయింది, ద్విచక్ర వాహనం నడుపుతున్న బాబూరావు తలకు బలమైన గాయమైంది. గాయపడిన ఇద్దరినీ స్థానికులు చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

ఎలమంచిలి, మే 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై పెదపల్లి రోడ్డు జంక్షన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ సావిత్రి తెలిపిన వివరాల ప్రకారం.. ఎలమంచిలిలోని వీరభద్రస్వామి ఆలయం సమీపంలో నివాసం వుంటున్న ఎడ్ల సన్యాసినాయుడు(37) ఎలక్ట్రికల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని పెదపల్లిలోని అత్తవారింటికి నడుచుకుంటూ వెళుతున్నాడు. పెదపల్లి జంక్షన్ వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా తుని వైపు నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొన్నది. తీవ్రంగా గాయపడిన సన్యాసినాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతని భార్య కరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సావిత్రి తెలిపారు.

ఏపీలోనూ సినిమా షూటింగ్‌లు చేయాలి

» ఎమ్మెల్యే పంచకర్ల డిమాండ్

సబ్బవరం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ప్రజల నుంచి ఆదాయం పొందుతున్న సినీ పరిశ్రమ, ఈ రాష్ట్రంలో సినిమా షూటింగ్‌లు చేసేందుకు మాత్రం ముందుకు రావడం లేదని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు అన్నారు. సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, సినిమా షూటింగ్‌లకు ఏపీలో అనేక అనువైన ప్రదేశాలు వున్నాయని, రానున్న రోజుల్లో పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తు న్నదని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సినిమా రంగానికి ఎంతో తోడ్పాటు అందిస్తున్నారని, కానీ ఆయన నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా విడుదలను అడ్డుకునేందుకు థియేటర్లను మూసివేస్తామని 'ఆనలుగురు' ఎగ్జిబిటర్లు బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు.

నూకాంబిక అమ్మవారికి చెర్రీ పండ్లతో అలంకరణ

అనకాపల్లి టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి గవరపాలెం అరుంధతి నగర్‌లోని స్వయంభూ పోతురాజు నూకాంబిక అమ్మవారి ఆలయంలో అమావాస్య సందర్భంగా సోమవారం అమ్మవారిని చెర్రీలు, డ్రాగన్ ఫ్రూట్స్ పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఘటాల వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.


చెర్రీస్, డ్రాగన్ ఫ్రూట్స్ అలంకరణలో నూకాంబిక అమ్మవారు

పరిశ్రమలను ప్రోత్సహించాలి

» కలెక్టర్ విజయకృష్ణన్


మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

నకాపల్లి కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్ర మలను స్థాపించడం ద్వారా పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవా లని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదే శించారు. సోమవారం కలెక్టరేట్ లో పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ 15న జరిగిన సమావేశం నుంచి ఇప్పటి వరకు 299 దరఖాస్తులు వివిధ శాఖల అను మతి కోసంరాగా.. వాటిలో 239 దరఖాస్తులను ఆమోదించినట్టు చెప్పారు. పెండింగ్ దరఖాస్తులను కూడా త్వరగా క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 21 పరిశ్రమలకు వివిధ రకాల రాయితీల కోసం రూ.1.72 కోట్లు మంజూరు చేయడానికి కమిటీ ఆమోదం తెలిపింది. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకందారులపై చర్యలు

» కశింకోట తహసీల్దార్ సత్యనారాయణ
» రంగబోలు గెడ్డ పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రంగబోలు గెడ్డలో మట్టి తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

కశింకోట, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గినపాలెం రెవె న్యూ పరిధి కొత్తపల్లి బుచ్చెయ్యపేట సమీపంలో ఉన్న రంగబోలుగెడ్డలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని తహసీల్దార్ జి.సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. 'రంగబోలుగెడ్డలో అక్రమ తవ్వకాలు' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. చెక్ డ్యాంను ఆనుకుని భారీ గొయ్యి పడేలా మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించినట్టు చెప్పారు. అనుమతులు లేకుండా ఎక్కడైనా మట్టి తవ్వకాలు జరిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వీఆర్వో శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539